


నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

ఎన్టీఆర్ కృష్ణా

బుధవారం 13 ఆగస్టు 2025 పేజీలు 8


## హాస్టల్స్ నిర్వహణ, నూతన హాస్టల్స్ నిర్మాణాలకు

# రూ. 300 కోట్లు విడుదల

- సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హాస్టల్స్ లో వినూత్న మార్పులు తీసుకువస్తున్నాము
- కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో నూతన హాస్టల్ భవన నిర్మాణాలు చేపట్టాము
- ఈ ఏడాది నుంచి పోస్ట్ మెట్రిక్ విద్యార్థులకు కూడా టవల్, బ్లాంకెట్, కార్పెట్ అందిస్తున్నాము
- హాస్టల్స్ మెనూలో నాణ్యమైన బియ్యం అందజేత
- సాంఘిక సంక్షేమ వసతి గృహాలపై తల్లితండ్రుల్లో నమ్మకం పెంచాలి
- సాంఘిక సంక్షేమ, వికలాంగులు, సీనియర్ సిటిజన్ సంక్షేమం, సచివాలయం, గ్రామ వాలంటీర్ల వ్యవహారాల శాఖా మంత్రి డా. డోలా బాల వీరాంజనేయ స్వామి






విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్ : సాంఘిక శాఖలో వినూత్న మార్పులు తీసుకువస్తున్నామని, హాస్టల్స్ లో తమ పిల్లలను చేర్పించే విద్యార్థుల తల్లితండ్రుల్లో భరోసా కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని సాంఘిక సంక్షేమ, వికలాంగులు, సీనియర్ సిటిజన్ సంక్షేమం, సచివాలయం, గ్రామ వాలంటీర్ల వ్యవహారాల శాఖా మాత్యులు డోలా బాల వీరాంజనేయ స్వామి అన్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రీజనల్ కాన్ఫరెన్స్ ను మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ వసతి గృహాల మరమత్తుల నిమిత్తం రూ. 143 కోట్లు, నూతనంగా నిర్మించే హాస్టల్ భవనాలకు రూ. 100 కోట్లకు పైగా, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నుంచి దాదాపు రూ. 50 కోట్లు విడుదల చేయడం జరిందన్నారు. మొత్తంగా దాదాపు రూ.300కోట్లు హాస్టల్స్‌కు 2

## నాయి బ్రాహ్మణుల సంక్షేమానికి కూటమి కట్టుబడి ఉంది

మంత్రి కొల్లు రవీంద్ర



మచిలీపట్నం మేజర్ న్యూస్ : మంగళవారం చర్లస్తా సెంటర్లో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలంలో సాధించిన అభివృద్ధి, నాయి బ్రాహ్మణుల సంక్షేమం పై నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయి బ్రాహ్మణ నాయకులు, తెలుగుదేశం పార్టీ నేతలు గొర్రెపాటి గోపీచంద్, మోటమర్రి బాబా ప్రసాద్, టౌన్ పార్టీ అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ పంచ పర్వాల కాశీ విశ్వనాథం, డివిజన్ ఇంచార్జి నాగబాబు తదితరులు చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ చిత్రాలకు పాలాభిషేకం చేశారు. ఫోన్ ద్వారా స్పందించిన రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, నాయి బ్రాహ్మణులకు అండగా నిలిచింది కూటమి ప్రభుత్వమేనని తెలిపారు. కూటమి అధికారంలోకి రావడంలో సహకరించిన మిగతా 2లో...



# దేశ రక్షణలో...

## సైనికుల సేవలు మరువలేం...

- మాజీ సైనికోద్యోగులకు డ్రోన్ల వినియోగంతో ఉద్యోగ అవకాశాలు
- వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం ఆధునిక వ్యవసాయానికి సూచిక
- హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజీత్

విజయవాడ, మేజర్ న్యూస్ : మాజీ సైనికోద్యోగులకు డ్రోన్ల వినియోగంతో మరోసారి దేశానికి, సమాజానికి సేవలు అందించే అవకాశం వచ్చిందని, దాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉందని హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజీత్ తెలిపారు. మంగళవారం రాష్ట్ర సైనిక వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్, కోరమాండల్ ఇంటర్నేషనల్, దక్ష డ్రోన్స్ ఆధ్వర్యంలో హోటల్ మినర్వాలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజీత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజీత్ మాట్లాడుతూ దేశానికి సేవలు అందించిన మాజీ సైనికోద్యోగులు డ్రోన్ల వినియోగంతో మిగతా 2లో

## వికసిత్ భారత్‌కు విలువైన మానవ వనరులు కీలకం



- విద్యార్థుల మేధస్సు వికసించేలా ప్రోత్సహించాలి
- సృజనాత్మక ఆలోచనలు చేసేలా అవకాశాలు సృష్టించాలి
- హ్యూమన్ క్యాపిటల్ ఫర్ వికసిత్ భారత్ వర్క్‌షాప్‌లో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

వివరాలు 2లో

# దేశ ప్రజలందరూ మద్దతివ్వండి..

**ఓటు హక్కును కాపాడుకుందాం**

**ఓట్ల చోరీపై ఎన్నికల సంఘాన్ని ప్రశ్నిద్దాం**

**సీడబ్ల్యూసీ మెంబర్ గిడుగు రుద్రరాజు పిలుపు**



**విజయవాడ మేజర్ న్యూస్ :** భారత ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించే అరాచక శక్తులను ఎదుర్కొనేందుకు లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ చేస్తున్న ఉద్యమానికి దేశ ప్రజలందరూ కలిసి రావాలని సీడబ్ల్యూసీ మెంబర్, ఏపీసీసీ పూర్వ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు మంగళవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. గత ఏడాది జరిగిన పార్లమెంట్ ఎన్నికలలో ఓట్ల చోరీపై భారత ఎన్నికల సంఘం స్పందన అప్రజాస్వామికమన్నారు. భారతీయుడి పవిత్రమైన ఓటు హక్కు వ్యవస్థను కాపాడాలని ఉద్యమిస్తున్న లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో సహా విపక్ష నేతలను అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. కర్ణాటక రాష్ట్రంలోని మహదేవపుర అసెంబ్లీ నియోజకవర్గంలో ఓట్ల చోరీ ఎలా జరిగిందో రాహుల్‌గాంధీ దేశ ప్రజలకు బహిరంగంగా చూపించారన్నారు. గతంలో ఎప్పుడూ కూడా దేశంలో ఇంత పెద్దస్థాయిలో ఓట్ల దొంగతనం జరగలేదన్నారు. ఓటు హక్కు అర్హత కలిగిన ఎంతో మంది భారతీయ పౌరుల ఓట్లను ఓటు హక్కుకు దూరం చేయడంతో సహ పలు అవాంఛనీయ పరిస్థితులను ప్రభుత్వంతో కలిసి ఎన్నికల సంఘం సృష్టించిందన్నారు.

ఇదే అంశంపై దేశ ప్రజలను జాగృతం చేసేందుకు వివిధ పార్టీల నేతలతో నిరసన తెలిపేందుకు వచ్చిన వారిని ఎన్డీఏ ప్రభుత్వం అణచివేసేందుకు ప్రయత్నిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ అవలంబిస్తున్న ఆర్.ఎస్.ఎస్. రాజ్యాంగంలో ప్రజాస్వామ్యంలో నిరసన వ్యక్తం చేసే స్వేచ్ఛ లేకపోవడం బాధాకరమన్నారు. ఓటు హక్కును కాలరాయడం భారత్ వంటి ప్రజాస్వామ్య దేశంలో జరగకూడదని రాజ్యాంగం ఎన్నో హక్కులు కల్పించిందని గుర్తుచేశారు. దేశ భవిష్యత్ కోసం రాహుల్ గాంధీ ధృడసంకల్పం ముందు నిర్బంధాలు, జైళ్లు ఏవీ అడ్డుకావు అన్నారు. దొడ్డిదారిలో బీజేపీ గెలుపు కోసం ఎన్నికల కమిషన్‌నే కలుషితం చేశారని ఆరోపించారు. ప్రజాస్వామ్యానికి కాపు కాయాల్సిన ఈసీ మోడీ కాపు కాస్తోందన్నారు. ఎన్నికల కమిషన్ తీరు చూస్తే మేడిపండు చందంగా ఉందని విమర్శించారు. స్వతంత్ర వ్యవస్థ కాస్త బీజేపీ చేతిలో కీలుబొమ్మగా మారిందన్నారు. ఆర్.ఎస్.ఎస్. లాంటి అనుబంధ సంస్థల జాబితాలో ఈసీ కూడా భాగమైందని, ఇవ్వాళ దేశంలో ఎన్నికల కమిషన్ అంటే "ఎలక్షన్ చోర్ కమిషన్" అని వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ బయటపెట్టిన నిప్పు లాంటి నిజాలపై సమాధానం చెప్పే దమ్ములేక డిక్లరేషన్ అంటూ వెనకుండి నాటకాలు ఆడిస్తున్నారని తెలిపారు. రాహుల్ గాంధీ ప్రారంభించిన ఓట్ చోర్ క్యాంపెయిన్‌ను ఆంధ్రప్రదేశ్‌లో సైతం కాంగ్రెస్ పార్టీ పక్షాన ప్రతి గడపకు చేరుస్తామన్నారు. మోడీ తీరును, బీజేపీ కోసం అధికార దుర్వినియోగం చేసిన ఎన్నికల కమిషన్ వైఖరిని ఎండగడతామని హెచ్చరించారు.

## పదేళ్ల వారంటీ ప్రణాళికతో అందుబాటులోకి న్యూ నిస్సాన్ మాగ్నైట్




**విజయవాడ మేజర్ న్యూస్ :** నిస్సాన్ మోటార్ ఇండియా కొత్త నిస్సాన్ మాగ్నైట్ కోసం 10 సంవత్సరాల పొడిగించిన వారంటీ ప్రణాళికను ప్రారంభించిందని నిస్సాన్ మోటార్ ఇండియా ఎండీ సౌరాబ్ వాట్సాతెలిపారు. ఇది ఒక విభాగం మొదటి కస్టమర్ కేంద్రీకృత చొరవ అని, ఇది నాణ్యత, విశ్వసనీయత బ్రాండ్ యొక్క దీర్ఘకాలిక నిబద్ధతను నొక్కి చెబుతుందన్నారు. కొత్త నిస్సాన్ మాగ్నైట్ విజయం సాధించిన వెంటనే ఈ ప్రణాళిక ప్రకటించబడిందన్నారు. మొత్తం ప్రయాణీకుల భద్రతపై 5 స్టార్ రేటింగ్ సాధించిందని, ఏఓపీ (వయోజన ఆక్యుపెంట్ సేఫ్టీ) పై ఖచ్చితమైన 5-స్టార్ రేటింగ్‌తో ఈ ప్రణాళిక 3 సంవత్సరాల ప్రామాణిక వారంటీని అందిస్తుందన్నారు. ఇది 10 సంవత్సరాల పొడిగించిన వారంటీ ప్రణాళిక యొక్క సౌకర్యవంతమైన ప్రణాళికల ద్వారా విస్తరించబడుతుందన్నారు. ఈ 10 సంవత్సరాల విస్తరించిన వారంటీ ప్రణాళిక వినియోగదారులకు ఎక్కువ విశ్వాసం, మనశ్శాంతిని ఇవ్వడానికి రూపొందించబడిందన్నారు.

ఇది నిస్సాన్ యొక్క కస్టమర్ సేవా వాగ్దానంలో భాగం, ఇందులో నిస్సాన్ కస్టమర్లకు స్థిరమైన భవిష్యత్తును విలువ, నమ్మకం, లక్ష్యంగా ఉన్న సేవను కలిగి ఉంటుందన్నారు. ఇది జపనీస్ డీఎన్ఏ, నాణ్యతా ప్రమాణాలు, బలమైన విశ్వసనీయత, ప్రీమియం హస్తకళ, సాంకేతికత యొక్క నిస్సాన్ యొక్క ప్రపంచ వాగ్దానాన్ని బలోపేతం చేస్తుందన్నారు. కొత్త నిస్సాన్ మాగ్నైట్ కురో స్పెషల్ ఎడిషన్‌ను సైతం ప్రారంభించినట్టు చెప్పారు. నిస్సాన్ యొక్క 10 సంవత్సరాల పొడిగించిన వారంటీ ప్రణాళికతో, కస్టమర్లు 10 సంవత్సరాల వరకు పూర్తి మనశ్శాంతిని పొందవచ్చు అని, సమగ్ర కవరేజ్ ఏ నిస్సాన్ అధికారం కలిగిన సేవా వర్క్‌షాప్‌లలో దేశవ్యాప్తంగా నగదు రహిత మరమ్మతులను అందిస్తుందన్నారు. క్లెయిమ్‌ల సంఖ్య లేదా విలువపై పరిమితి లేదని, నిజమైన నిస్సాన్ విడి భాగాలను ఉపయోగించి అధిక నాణ్యత సేవకు హామీ ఇచ్చేటప్పుడు, మరమ్మత్తు ఖర్చులపై గణనీయమైన పొదుపులను నిర్ధారిస్తుందన్నారు. అదనంగా, విస్తరించిన వారంటీ ప్రణాళికను నిస్సాన్ ఫైనాన్స్ ద్వారా కొత్త వాహనం కొనుగోలుతో పాటు సులభంగా నిధులు సమకూర్చవచ్చు అని చెప్పారు. "కొత్త నిస్సాన్ మాగ్నైట్ భారతీయ కస్టమర్లకు నాణ్యత, విశ్వసనీయత, భద్రత, దీర్ఘకాలిక విలువకు చిహ్నంగా ఉద్భవించిందని,, గ్లోబల్ ఎన్‌సిఏపి నుండి ప్రతిష్టాత్మక 5 స్టార్ భద్రతా రేటింగ్‌తో ఉందని అన్నారు.

## ఏఐ ఎడిట్ జీనీ, మెరుగైన పనితీరుతో రియల్ మీ 15 సిరీస్ ఆవిష్కరణ




**విజయవాడ, ఆగస్టు 12, మేజర్ న్యూస్ :** రియల్ మీ అనేది భారత యువత లో అత్యంత పేరు గాంచిన స్మార్ట్‌ఫోన్ బ్రాండ్, ఈరోజు అది రియల్ మీ 15 ప్రో 5జీ, రియల్ మీ 15 5జీని ఆవిష్కరించింది, అది ఏఐ పార్టీ ఫోన్ గా పొజిషన్ చేయ్యబడినది. కొత్త కెమెరా ఎల్నిలెన్స్, ఎడ్వాన్స్ ఏఐ మొత్తం పనితీరు ని అందిస్తుంది. విభిన్నమైన జీవన్ శైలి ని వీక్షించాలి అనుకునే యువత కోసం డిజైన్ చెయ్యబడినది. రియల్ మీ 15 సిరీస్ లో ట్రిపుల్ 50ఎంపీ అల్ట్రా కెమెరాలు ఉంటాయి. అవి 4కె 60ఎఫ్ పి ఎస్ వీడియో రికార్డింగ్ ని అందిస్తుంది. విభిన్నమైన క్రిస్టల్ క్లియర్ షాట్ లను ఏ యాంగిల్ నుంచి అయినా ఏ క్షణం అయినా అందిస్తుంది. అది ఏఐ ఇమేజింగ్ ని ప్రపంచంలో మొదటి ఏఐ ఎడిట్ ఇంజన్ టెక్నాలజీ తో కూడా మెరుగుపరుస్తుంది. దీంతో పాటు అద్భుతమైన ఏ ఐ పార్టీ మోడ్ ని ముఖ్యంగా యువ వినియోగదారుల కోసం సృష్టించబడినది.

**ట్రిపుల్ 50ఎంపి కెమెరాలు, ట్రిపుల్ కిల్**

రియల్ మీ 15 ప్రో 5 జి ట్రిపుల్ 50ఎం మెరుగైన స్పష్టత ఉన్న కెమెరా వ్యవస్థ ని కలిగి ఉంటాయి. ఫ్లాగ్ షిప్ 50ఎం సోనీ ఎల్ ఎంఎక్స్896 ఓ ఐ ఎస్ కెమెరాతో అది 1/1.56" పెద్ద సెన్సార్ ని 24ఎంఎం కి సమానమైన ఫోకల్ లెంత్‌తో ఆకర్షనీయమైన నైట్ స్కేప్ లతో పాటు సాటి లేని స్పష్టత ని, ఆకర్షనీయతని, నిజమైన రంగులను కలిగి ఉంటుంది. 50ఎం వెడల్పాటి యాంగిల్ ఉన్న కెమెరా తో పాటు 1/2.8" సెన్సార్ ని 16ఎంఎం కి సమానమైన ఫోకల్ లెంత్ ని, 50ఎం ముందు కెమరా తో పాటు 1/2.8" సెన్సార్ ని కలిగి ఉంటుంది, అది అధిక నాణ్యత కలిగిన గ్రూప్ ఫోటో లను, సెల్ఫీ లను డెలివర్ చేస్తుంది. అదనంగా అది శక్తివంతమైన కెమెరా వ్యవస్థ ని విభాగం లో అత్యధిక స్థాయిలో కలిగి ఉంటుంది, అది 4కె 60ఎఫ్.పి.ఎస్ వీడియో షూటింగ్ సౌకర్యాన్ని యువ వినియోగదారుల రోజువారీ జీవితం లో రికార్డ్ చెయ్యగలదు. రియల్ మీ 15 5 జి రెండు శక్తివంతమైన 50ఎం కెమెరా లను కలిగి ఉంటుంది. ఒక 50ఎం సోనీ ఐ ఎం ఎక్స్ 882 ఓ ఐ ఎస్ ఫ్లాగ్ షిప్ మెయిన్ కెమెరా తో పాటు ఉన్న పెద్ద సెన్సార్ 50ఎం వోవి50డి ఫ్రంట్ కెమెరా ను కలిగి ఉంటుంది. అది స్పష్టమైన, శక్తివంతమైన సెల్ఫీ లను, గ్రూప్ ఫోటో లను, తక్కు కాంతి కలిగిన షూటింగ్ ని అందిస్తుంది, అది వినియోగదారులు ఉచితంగా ఫోటోలను తక్కువ కాంతిలో కుడా తియ్యడానికి సహాయపడుతుంది, అది ప్రతి యాంగిల్ నుంచి అన్ని కొనాల నుంచి స్పష్టంగా సుకర్యవంతంగా ఫోటోలు తియ్యడానికి సహాయపడుతుంది. వీడియో పనితీరు విషయానికి వస్తే రియల్ మీ 15 5 జి యొక్క ముందు, వెనక లెన్స్ రెండూ 4కె వరకు తియ్యగాలవు, అవి ప్రో గ్రేడ్ వీడియో లను తియ్యడానికి పేకింగ్ చెయ్యబడతాయి కాబట్టి మీరు ఏ కోణం నుంచి అయినా ఏ సన్నివేశం నుంచి అయినా బీట్ మిస్ అవ్వకుండా రికార్డ్ చెయ్యవచ్చు.

## నియోజవర్గంలో యూరియా కొరత లేదు

**నియోజకవర్గానికి 4,096.35 టన్నుల యూరియా సరఫరా**



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** నియోజకవర్గంలో రైతుల కోసం ఇప్పటికే 4,096.35 టన్నుల యూరియా సరఫరా జరిగిందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మంగళవారం మీడియాకు తెలిపారు. ఈ ఖరీఫ్ సీజనులో నియోజకవర్గంలో రైతులు 33,525 హెక్టార్లలో వరి సాగు చేస్తున్నట్లు తెలిపారు. రైతుల కోసం గ్రామాల్లోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాలు, దుకాణాలకు 4,096.35 టన్నులు యూరియా సరఫరా జరిగిందని తెలిపారు. చల్లపల్లి మండలానికి 4,918 హెక్టార్ల రైతులకు ఇప్పటికే 832.75 టన్నులు, ఘంటసాల మండలానికి 7,757 హెక్టార్ల రైతులకు 846.10 టన్నులు, మోపిదేవి మండలానికి 4,331 హెక్టార్ల రైతులకు 576.7 టన్నుల యూరియా సరఫరా చేసినట్లు తెలిపారు. నాగాయలంక మండలానికి 6,806 హెక్టార్ల రైతులకు 859.6 టన్నులు, కోడూరు మండలానికి 7,002 హెక్టార్ల రైతులకు 785.00 టన్నులు, అవనిగడ్డ మండలానికి 2,711 హెక్టార్ల రైతుల కోసం 196.2 టన్నుల యూరియా సరఫరా చేసినట్లు వివరించారు. నియోజకవర్గంలో ఇంకా రైతులకు యూరియా అవసరమున్నా గుర్తించి ఆయా గ్రామాల రైతుల అవసరాలకు తగిన యూరియా సరఫరా చేస్తామని స్పష్టం చేశారు. యూరియా గురించి రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. నియోజకవర్గంలో ఈ సీజనులో వరి పంటకు 6,267 టన్నులు, ఉద్యానవన పంటలకు 850 టన్నులు మొత్తం 7,117 టన్నులు యూరియా అవసరం కాగా, ఆగస్ట్ మొదటి వారానికే యాభై శాతానికి పైగా 3,736 టన్నులు యూరియాను సొసైటీలు, ప్రైవేట్ దుకాణాల ద్వారా సరఫరా జరిగిందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

## యానాది కుటుంబాలకు జీవనదాయినిగా నాబార్డ్

**విజయవాడ ఆగస్టు 12, మేజర్ న్యూస్ :** కృష్ణా జిల్లా కొడూరు, నాగయలంక మండలాల యానాది గిరిజనుల జీవన విధానంలో నాబార్డ్ కొత్త వెలుగులు నింపుతోంది. "మ్యాంగ్రోవ్‌లపై ఆధారపడి జీవించే యానాది గిరిజన సమాజం జీవనోపాధి అభివృద్ధి" ప్రాజెక్టు ద్వారా, కట్టెల తోపుడు పడవలతో కష్టపడి పీతలు, చేపలు పట్టే ఈ సమాజం ఇప్పుడు మోటారు పడవలతో ఆదాయాన్ని రెట్టింపు చేసుకునే దిశగా అడుగులు వేస్తోంది. ప్రజా ప్రగతి సేవా సంఘం (పిపిఎస్ఎస్) సహకారంతో అమలవుతున్న ఈ ప్రాజెక్టులో భాగంగా, నాగయలంకలో నిర్వహించిన కార్యక్రమంలో నాబార్డ్ ఉప మేనేజింగ్ డైరెక్టర్ డా. ఏ.కె.సూద్ లబ్ధిదారులైన కుటుంబాలకు ఐదు మోటారు పడవలు, వలలు, ఐస్‌బాక్స్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎం.ఆర్.గోపాల్, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. మొత్తం 30 పడవలు, 30 కేజ్ కల్చర్ యూనిట్లు, జలకర్షణ కొలనులు, పెన్ కల్చర్ యూనిట్లు, ఫీడ్ తయారీ కేంద్రం, 20 పీత గుడ్లు పెంచే నర్సరీలతో కూడిన ఈ ప్రాజెక్టులో 75% పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. ఫలితంగా ఉత్పాదకత, ఆదాయం పెరగడంతో పాటు తాగునీరు, ఆరోగ్య సేవలు సులభంగా అందుబాటులోకి వచ్చాయి. ముఖ్యంగా మహిళల్లో ఆత్మవిశ్వాసం, నాయకత్వ నైపుణ్యం పెరిగిందని లబ్ధిదారులు చెబుతున్నారు. "ఇప్పటివరకు గంటల కొద్దీ నడిచి పీతలు పట్టేదాన్ని. ఇప్పుడు పడవతో ఎక్కువ పట్టి, ఎక్కువ సంపాదించగలుగుతున్నాం," అని ఒక యానాది మహిళ ఆనందంగా తెలిపింది. మ్యాంగ్రోవ్‌లనుంచి మార్కెట్ వరకు ఈ ప్రాజెక్టు యానాది గిరిజనుల జీవితాలకు గౌరవం, స్థిరత్వం, ఉజ్వల భవిష్యత్తు దిశగా దారితీస్తోంది.

## ప్రతి ఇంటి పైన జాతీయ జెండా ఎగరవేయాలి




**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** దేశ ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు ప్రతి ఇంటి పైన జాతీయ జెండా ఎగరవేయాలని ఎంపీడీవో వనజ పిలుపునిచ్చారు. మంగళవారం హర్ ఘర్ తిరంగ కార్యక్రమము లో భాగంగా స్కూల్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ జెండాలు పట్టుకుని ర్యాలీ నిర్వహించి హర్ ఘర్ తిరంగ పై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా స్వతంత్ర దినోత్సవ వేడుకలు పెద్ద పండుగగా నిర్వహించాలని ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు తేదీ ఇంటిపైన జాతీయ జెండా ఎగరవేసే విధంగా కృషి చేయాలన్నారు కార్యక్రమములో పంచాయతీ కార్యదర్శి తోట శ్రీనివాసరావు పాఠశాల ప్రధానోపాధ్యా యులు,పాఠశాల సిబ్బంది, మండల పరిషత్ కార్యాలయ సిబ్బందితో పాటు పలువురు ర్యాలీలో పాల్గొన్నారు.



## సచివాలయ సిబ్బందితో పరిచయ కార్యక్రమం

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** సాధారణ బదిలీలలు భాగంగా మండలానికి కొత్తగా వచ్చిన సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తుంగల సుమతీ దేవి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి యం.వనజ మండలము నూతనంగా బాధ్యతలు చేపట్టిన పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బందితో పరిచయ కార్యక్రమము జరిగింది.ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ లక్ష్మీ నారాయణ, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యులు షేక్ నజీర్ భాషా, పంచాయతీ కార్యదర్శులు, నూతనంగా బదిలీపై వచ్చిన గ్రామ సచివాలయ సిబ్బంది,మండల పరిషత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 142 మంది విద్యార్థులకు నులిపురుగు నివారణా మాత్రలు



**గుడ్లవల్లేరు ఆగస్టు 12 మేజర్ న్యూస్:** జాతీయ నులి పురుగుల నివారణా దినోత్సవం సందర్భంగా గుడ్లవల్లేరు శ్రీసాయి విద్యా నికేతన్ పాఠశాల విద్యార్థులు 142 మందికి గుడ్లవల్లేరు ఆరోగ్య కార్యకర్త ఇ. రమాదేవి నులి పురుగుల నివారణ ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. ఈ కార్యక్ర మంలో ఆశా కార్యకర్తలు విజయలక్ష్మి, సుధారాణి, చందనలక్ష్మి జ్యోతి, పాఠశాల కరస్పాండెంట్ సింగంశెట్టి ఆదినారాయణ, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలను ఆర్థిక సాయం





**పమిడిముక్కల ఆగస్టు 12 మేజర్ న్యూస్ :** పమిడి ముక్కల మండల పరిధిలోని కపిలేశ్వరపురం గ్రామం పడమట మాల పల్లిలో వేరువేరు కుటుంబాలను స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు పరామర్శించారు. అసిలేటి బుచ్చిబాబు కుటుంబాన్ని పరామర్శించి ఆ కుటుంబానికి 5,000 రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించారు. అలాగే అదే దళితవాడలో అసిలేటి భిక్షులు కుటుంబాన్ని పరామర్శించి ఆ కుటుంబానికి పదివేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు తాతినేని రమేష్, తాతినేని సాయి లు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా పాల్గొన్నారు.

## లక్ష్మి శ్రీని పరామర్శించిన ఎమ్మెల్యే కుమార్ రాజా



**తోట్లవల్లూరు ఆగస్టు 12 మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని తోట్లవల్లూరు గ్రామంలో వర్ల రామయ్య సేవా సమితి అధ్యక్షురాలు ఈడుపుగంటి లక్ష్మి శ్రీ ఇటీవల అనారోగ్యంతో చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటుండగా స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా ఆమెను పరామర్శించారు. తోట్లవల్లూరులోని ఆమె స్వగృహానికి వెళ్లిన ఎమ్మెల్యే ఆమెను పరామర్శించి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆమె త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమార్ రాజా తో పాటు తెలుగుదేశం నాయకులు నెక్కలపు మురళి, చాట్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పిఎసిఎస్ అధ్యక్షులుగా చిల్లపల్లి కృష్ణ



**ఏ.కొండూరు, ఆగస్టు 13 మేజర్ న్యూస్ :** మండలంలోని కంభంపాడు గ్రామ సహకార సంఘం అధ్యక్షులుగా చిల్లపల్లి కృష్ణ నియమించబడ్డారు. పిఎసిఎస్ అధ్యక్షులుగా నియమించిన సందర్భంగా ఎంపీ కేసినేని శివనాథ్ ( చిన్ని), తిరువూరు నియోజకవర్గ శాసనసభ్యులు కొలికిపూడి శ్రీనివాసరావుకు, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు భరోతు పిక్లా నాయక్,, టిడిపి సీనియర్ నాయకులు గడ్డి కృష్ణారెడ్డి, మాజీ ఏఎంసి చైర్మన్ అలవాల రమేష్ రెడ్డి, మండల స్థాయి టిడిపి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

# స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా భద్రతా ఏర్పాట్లపై సమీక్ష





**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకొని ఈ నెల 15న ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో జరగబోతున్న స్వాతంత్ర వేడుకల భద్రత ఏర్పాట్లపై మంగళవారం నగర పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు, జిల్లా కలెక్టర్ జి.లక్ష్మి షా ఆధ్వర్యంలో పోలీసు అధికారులు, జిల్లా అధికారులతో ఇందిరా గాంధీ మునిసిపల్ స్టేడియంలో ఆయా శాఖల అధికారులు చేయు ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగర పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు మాట్లాడుతూ స్వాతంత్ర వేడుకలలో పాల్గొనడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి, మినిస్టర్లు, వి.వి.ఐ.పి.లు/వి.ఐ.పి.లు, ప్రజలు ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంకు విచ్చేస్తారు. ఈ నేపధ్యంలో స్టేడియం పరిసర ప్రాంతాలలో సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకొని చేయు కట్టు దిట్టమైన భద్రత, పటిష్ట బందోబస్తు ఏర్పాట్ల గురించి, వేడుకల్లో కంటిజెన్సీ బృందాలు కవాతు ఏర్పాట్ల గురించి, ట్రాఫిక్ ఏర్పాట్ల గురించి కూలకుషంగా చర్చించారు. స్టేడియంలో, పరిసర ప్రాంతాలలో భద్రతా పరంగా ఎటువంటి చిన్న లోపాలు లేకుండా కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టాలని ఉన్నత అధికారులుకు ఆదేశాలు జారి చేసారు. ఇందిరా గాంధీ మునిసిపల్ స్టేడియం, పరిసర ప్రాంతాలలో ఎటు వంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని శాఖల అధికారుల సమన్వయంతో అప్రమత్తంగా పటిష్టమైన బందోబస్త్ ఏర్పాట్లపై, ఇతర ప్రయాణికులకు వారి ప్రయాణంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన ఇతర మార్గాలను నిర్దేశించే విధంగా, వాహనాల రద్దీ ఏర్పడకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ నేపధ్యంలో ఈ కార్యక్రమానికి విచ్చేయు ప్రముఖులకు, ప్రజలకు లా & ఆర్డర్, ట్రాఫిక్ పరంగా ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు, బందోబస్తు ఏర్పాట్లలో ఎక్కడా అలసత్వం ప్రదర్శించకుండా భద్రతా పరంగా ఎటువంటి చిన్న లోపాలు లేకుండా సంబంధిత శాఖలతో సమన్వయం చేసు కొని తగిన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేయడంతో పాటు, తగు సూచనలను అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జి.లక్ష్మి షా, డి.ఐ.జి. ఐ.ఎస్.డబ్ల్యూ కె.ఆరిఫ్ హాఫీజ్, డి.సి.పి.లు కె.జి.వి.సరిత, ఎస్. వి.డి ప్రసాద్, ఏ.డి.సి.పి.లు, ఏ.సి.పి.లు, జిల్లా అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

# భారతీయుడి పవిత్రమైన ఓటు హక్కు వ్యవస్థను కాపాడాలని ఉద్యమిస్తున్న రాహుల్

### లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తో సహా విపక్ష నేతలను అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండించిన బొర్రా కిరణ్




**జి.కొండూరు మేజర్ న్యూస్ :** నిన్న ఢిల్లీ లో ఇండియా కూటమి నాయకుల అరెస్ట్ పై నిరసన గా సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొర్రా కిరణ్ ఆధ్వర్యంలో మైలవరం పట్టణం లో నూజివీడు రోడ్డ్ లో గల మహాత్మా గాంధీ, పొట్టి శ్రీరాముల విగ్రహాలు దగ్గర ముందుగా వారి విగ్రహాలకు పూల మాలలువేసి నిరసన కార్యక్రమంప్రారంబించారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకుల తో కలసి బొర్రా కిరణ్ పాల్గొన్నారు.దొంగ ఓట్లతో గద్దెనెక్కిన బీజేపీ, వారి( ఎన్ డి ఏ )కూటమి సభ్యులు పై ఎన్నికలపై లేవనెత్తిన సందేహాలు ఆరోపణలకు ఎలక్షన్ కమిషన్ బదిలీవ్వాలి ని డిమాండ్ చేసిన కాంగ్రెస్ పార్టీఈ సందర్బంగా మాట్లాడుతూఏఐసీసీ నేత రాహుల్ గాంధీ, ఇండియా కూటమి నాయకులను అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని,దేశంలో గత సార్వత్రిక ఎన్నికలపై ప్రతిపక్ష నేత రాహుల్గాంధీ లేవనెత్తిన అనేక సందేహాలకు, ఆరోపణలకు ఎలక్షన్ కమిషన్ సమాధానం ఇవ్వ కపోగా రాహుల్ గాంధీని అరెస్టు చేయడం దారుణమని విమర్శించారు.రాజ్యాంగం మనకు ఇచ్చిన పవిత్రమైన ఓటు బీజేపీ అధికార దాహానికి బలి అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.దొడ్డిదారిన గెలిచేందుకు బీజేపీ ఎన్నికల కమిషన్ ను కలుషితం చేయడం బాధాకరమన్నారు.స్వతంత్ర వ్యవస్థ బీజేపీ చేతుల్లో కీలుబొమ్మగా మారిందని విమర్శించారు.ఓటు చోరీ గురించి రాహుల్ గాంధీ సవివరమైన ప్రజెంటే షన్ ద్వారా లేవనెత్తిన సందేహాలకు సమాధానం ఇవ్వలేదని తెలిపారు.ఎన్నికల సంఘం (ఈసీ) అవకతవకలకు పాల్పడినట్లు గత కొద్ది రోజులుగా దేశ ప్రతిపక్ష నేత రాహుల్గాంధీ గణాంకాలతో ఆధారాలు చూపిస్తే ఎన్నికల సంఘం ఇంతవరకు సమాధానం చెప్పలేదని బొర్రా కిరణ్ ఆరోపించారు.రాజ్యాంగ వ్యవస్థయిన ఈసీ ప్రజ లందరికీ జవాబుదారీగా ఉండాల్సింది పోయి ప్రజలకు వ్యతిరేకంగా ఎన్ డి ఏ కూటమికి కు అనుకూలంగా పనిచేస్తోందన్నారు. రాజకీయాలకు అతీతంగా ఈసీ పనిచేయాలని కోరారు. దొంగ ఓట్లు, ఈవీఎం ట్యాంపరింగ్లతోనే ఎన్డీఏ కూటమి గద్దెనెక్కిందని,వచ్చే ఎన్నికలు బ్యాలెట్ పేపర్ తోనే నిర్వహించాలని బొర్రా కిరణ్ డిమాండ్ చేశారు ఈ కార్యక్రమం లో పార్టీ నాయకులు శీలం రామకృష్ణ,చిలుకూరు సర్పంచ్ గొంది సురేష్,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిట్టల నాగేశ్వరరావు, దోసపాటి గిరి కుమార్,దూరు రవికుమార్ మసనం సుధాకర్, అన్నవరపు దుర్గారావు, ఆంజనేయులు,అక్కల ప్రసాద్,రాగాల రాము,చెరుకు ఆనందరావు, కాంగ్రెస్ నాయకులుతదితరులు అభిమానులు పాల్గొన్నారు.

# గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన



**గుడ్లవల్లేరు ఆగస్టు 12 మేజర్ న్యూస్:** స్థానిక శేషాద్రి రావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీలో ఇంజనీరింగ్ విద్య మొదటి సంవత్సరం విద్యార్థులకు జీరో సెమిస్టర్ లో భాగంగా వ్యక్తిత్వ వికాసంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ సైకాలజిస్ట్, ప్రవర్తనా నైపుణ్యాల శిక్షకులు, డైరెక్టర్,కెరీర్ కౌన్సిలింగ్ సెంటర్, హైదరాబాద్ నుండి ముఖ్య అతిథి, వక్తగా సంద్ర సుధీర్ విచ్చేశారు. విద్యార్థికి స్ఫూర్తిని కలిగించేలా 'నీ జీవిత నిర్మాణ శైలి నీవే ఒక అద్భుత శిల్పివి' అను అంశంపై సందేశాత్మక ప్రసంగాన్ని సంద్ర సుధీర్ చేశారు. తొలుత సంద్ర సుధీర్ ను ఆంగ్ల అధ్యాపకులు జె.జయ ప్రకాష్ సభకు పరిచయం చేశారు. అనంతరం సుధీర్ మాట్లాడుతూ విద్యార్థి జీవితం వెలగాలంటే మనస్సును నియంత్రణలో ఉంచుకుని, విషయాన్ని విభిన్నంగా ఆలోచన చేసి, ఆచరణలో పెట్టె నైపుణ్యం కలిగి ఉండాలని అభిప్రాయపడ్డారు. సామాజిక పరిస్థితులకు అనుగుణంగా మనిషి మానసిక పరిస్థితిని నాలుగు రకాలుగా వర్ణించవచ్చునని వివరణాత్మక ఉదాహరణలతో తెలిపారు. సామాజిక పరిస్థితులకు భిన్నంగా గౌరవ మర్యాదలు పొందడానికి విద్య ఒక సాధనమని, దానికి క్రమశిక్షణాయుత కృషి, పట్టుదలలే ఇంధనమన్నారు. ప్రతీ విద్యార్థి తమ తల్లిదండ్రులకు, కళాశాలకు, సమాజానికి దూతలని హితవు పలికారు. సమయం, ప్రయత్నం, ఆర్థిక వనరులు సమకూర్చడం దైనందిన జీవితంలో ప్రతీ ఒక్కరికీ పెట్టుబడి అనీ, అయితే సమయం, ప్రయత్న లోపం లేక పోవడం విధ్యార్థికి అత్యంత కీలకమైన అంశాలని ప్రముఖ వ్యక్తులను పరిచయం చేసి, వారి క్రియా నైపుణ్యాలను, అభివృద్ధి చెందిన తీరును సాంద్ర సుధీర్ విద్యార్థులకు పవర్ పాయింట్ ప్రదర్శన ద్వారా తెలిపి ఉత్సాహ పరచి, ఆలోచింపజేశారు. ఉత్పాదకత ఉండేలా పనిచేయడమే నైపుణ్యమన్నారు. అనంతరం విద్యార్థులచే వ్యక్తిత్వ వికాసానికి సంబంధించి ప్రాక్టీస్ తరగతులను వివిధ కార్యకలాపాలు ద్వారా వివరించే ప్రయత్నం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణ కుమార్ సంద్ర సుధీర్ ను జ్ఞాపికతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ పి.సిద్ధయ్య, యాజమాన్య సలహాదారు డాక్టర్ పి.రవీంద్ర బాబు, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ పి కోదండ రామారావు, డాక్టర్ ఎం.ఆర్.సి.హెచ్.శాస్త్రి, డైరెక్టర్స్ డాక్టర్ జి.వి.ఎన్.ఆర్.వి.ప్రసాద్, డాక్టర్ ఎం.కామరాజు, ఎస్.ఐ.పి.కోఆర్డినేటర్స్ డాక్టర్ ఎల్.ఆర్.శ్రీనివాస్, డాక్టర్ ఎస్.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థులను ఆదుకోవడంలో ఎంతో ఆనందం



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదని కృష్ణా జిల్లా మానవత విద్యా నిధి కోఆర్డినేటర్ పి శ్రీరామ్ అన్నారు మచిలీపట్నం మానవతా స్వచ్ఛ సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం సన్ స్టార్ స్కూల్లో జరిగిన కార్యక్రమంలో చైతన్య కళాశాల ఇంటర్ సెకండియర్ విద్యార్థిని కె లక్ష్మీ నిఖితకు రూ 10,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో శ్రీరామ్ మాట్లాడుతూ,జిల్లాస్థాయిలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ విద్యానిధి కింద రూ 50 లక్షలు నిధులు సేకరిస్తున్నామన్నారు మచిలీపట్నం మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం అనాధ శవానికి,అంత్యక్రియలు జరిపామన్నారు ఈ కార్యక్రమంలో సంస్థ జిల్లా కోఆర్డినేటర్ ముదిగొండ శాస్త్రి శవానికి దహన సంస్కారాలు జరిపారన్నారు. కరోనా సమయంలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పలు అనాధ శవాలకు దహన సంస్కారాలు జరిపారన్నారు బుడమేరు వరద బాధితులను ఆదుకునేందుకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నాలుగు రోజులపాటు సేవలందించారన్నారు. మచిలీపట్నం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు జి కిషోర్ కుమార్ అధ్యక్షత వహించి మాట్లాడాతూ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా మచిలీపట్నం నగరంలోని పదవ తరగతి విద్యార్థులకు చిత్రలేఖనంలో పోటీలు నిర్వహించి ప్రశంసా పత్రాలు, మెడల్స్ బహుమతులుగా అందజేస్తున్నామన్నారు ఈ కార్యక్రమంలో మచిలీపట్నం మానవత మహిళా విభాగం కన్వీనర్ కరెడ్ల సుశీల, చిట్టి కుమారి, నాగమణి, రెడ్ క్రాస్ కార్యదర్శి శంకర్నాథ్, ఆదిత్య,, నూర్జహాన్, ముదిగొండ శాస్త్రి మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో అనాధ శవానికి అంత్య క్రియలు మచిలీపట్నం చిలకలపూడి లోని అన్నపూర్ణ వృద్ధాశ్రమంలో అనాథ మహిళ కుమారి మంగళవారం మృతి చెందారు ఆమెకు మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో దహన సంస్కారాలు నిర్వహించారు అనా ధ శవానికి ముదిగొండ శాస్త్రి తలకొరివి పెట్టారు .ఈ కార్యక్రమంలో మానవతా స్వచ్ఛంద సేవ సంస్థ మహిళా విభాగం కన్వీనర్, వృద్ధాశ్రమం నిర్వాహకురాలు కరెడ్ల సుశీల రత్నాకర్ రావు, ఆంజనేయ కుమార్ తదితరులు పాల్గొన్నారు

# ప్రజాస్వామ్యాన్ని భ్రష్టు పట్టిస్తున్న కూటమి ప్రభుత్వం

**ఇందుకు పులివెందులలో జరిగిన జడ్పిటిసి ఉప ఎన్నికే నిదర్శనం....**

**వైఎస్ఆర్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్ కుమార్**



**పామర్రు ఆగస్టు 12 మేజర్ న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజాస్వామ్యాన్ని ఎంతలా భ్రష్టు పట్టిస్తున్నారో మంగళవారం పులివెందులలో జరిగిన అప్రజాస్వామిక జడ్పీటీసీ ఉప ఎన్నికలే నిలువెత్తు నిదర్శనమని పామర్రు మాజీ శాసనసభ్యులు, వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్ కుమార్ ధ్వజమెత్తారు. స్వయం ప్రతిపత్తి కలిగిన ఎన్నికల వ్యవస్థని తమ చేతుల్లోకి తీసుకుని రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి, ప్రశాంతంగా జరగాల్సిన ఎన్నికలని, రాష్ట్రంలోని పోలీస్ వ్యవస్థని ఉపయోగించుకుని తెలుగుదేశం, కూటమి నాయకులు వై.యస్.ఆర్.సి.పి నాయకులపైనా, పోలింగ్ ఏజెంట్లపైన, అలాగే సామాన్య ప్రజలపైన ఏ విధంగా అడ్డగోలుగా దాడులు చేస్తూ, అక్రమ అరెస్టులతో భయభ్రాంతులకు గురి చేస్తూ, ఓటుహక్కు ఉపయోగించుకునేందుకు కనీసం పోలింగ్ బూత్ ల వద్దకు కూడా వెళ్లనీయకుండా మానవత్వం మరిచి ఎంత నీచంగా ప్రవర్తిస్తున్నారో రాష్ట్రంలోని ప్రజలే కాకుండా యావత్ దేశం చూస్తోందన్నారు. తమ కళ్ళ ఎదుట ఇంత ఘోరమైన పరిస్థితుల్లో ఎన్నికలు గంగరగోళంగా జరుగుతుంటే, ప్రజాస్వామ్యాన్ని కాపాడవలసిన పోలీస్ వ్యవస్థ కనీసం స్పందించకపోగా, సామాన్య ప్రజల దగ్గరనుంచి ఓటర్ స్లిప్పులు బలవంతంగా లాక్కొని ప్రజలను పోలింగ్ బూత్ లకి వెళ్ళకుండ అడ్డుకుంటూ, పోలింగ్ బూత్ లలో రిగ్గింగ్ కు పాల్పడుతున్న టీడిపి గుండాలకు పోలీస్ లు సహకరిస్తున్న తీరు సిగ్గుచేటని, ఇది పోలీస్ వ్యవస్థమీద ఎప్పటికీ ఒక మాయని మచ్చలా మిగిలిపోతుందని ఆవేదన వ్యక్తం చేసారు. సుపరిపాలన అని డప్పాలు కొట్టుకుంటున్న చంద్రబాబు అయన గ్యాంగ్, నిజంగానే ఈ 14 నెలల కాలంలో ప్రజలకు అంత మంచి పరిపాలన అందించి ఉంటే, కేవలం ఒక జడ్పీటీసీ ఉప ఎన్నిక కోసం రాష్ట్రంలోని మంత్రులు, ఎమ్మెల్యేలు అందరూ రాష్ట్ర ప్రజల సమస్యలు గాలికి వదిలేసి సుమారు 15 రోజులనుంచి పులివెందులలోనే మకాం వేశారు అంటేనే చంద్రబాబుకు ఆయన పరిపాలన మీద ఎంత నమ్మకమో తెలుస్తోందని ఎద్దేవా చేసారు. మొదటినుంచి కూడా తెలుగుదేశం, కూటమి నాయకుల తీరుపై, వారు చేస్తున్న దాడులపై ఎలక్షన్ కమిషన్ కి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ప్రజాస్వామ్యాన్ని కాపాడవలసిన వ్యవస్థలు కూడా నిమ్మకు నీరెత్తినట్లు ఉండటం, ఈ ప్రభుత్వంలో వ్యవస్థలయొక్క చేతకానితనానికి అద్దంపడుతుందని, ఎలక్షన్ వ్యవస్థ, పోలీస్ వ్యవస్థ సకాలంలో స్పందించి సమర్ధవంతంగా పనిచేసి ఉంటే ఈరోజు పులివెందుల ఉపఎన్నిక రాష్ట్ర చరిత్రలో చీకటిరోజుగా మిగిలేది కాదని, ఇప్పటికైనా వ్యవస్థలు కళ్ళు తెరిచి కొందరు వ్యక్తులకోసం కాకుండా ప్రజలకోసం పని చేస్తూ ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని లేదంటే అతి త్వరలోనే ప్రజలే ఎదురు తిరిగి రోడ్లమీదకు వచ్చి ఈ కూటమి ప్రభత్వానికి బుద్ధిచెప్పే రోజు వస్తుందని అనిల్ కుమార్ హెచ్చరించారు.

# పాలకులు మారుతున్న పూర్తి చేయని పోలంపల్లి డ్యాం

**వత్సవాయి, ఆగస్టు 12, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నర్రా సూర్యనారాయణ మాట్లాడుతూ డ్యాము శంకుస్థాపన చేసి 21 సంవత్సరాలుపోలంపల్లి మునీర్ ప్రాజెక్టు పాలకుల నిర్లక్ష్యం వల్ల ఆగిపోయిందని సంఘం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నర్రా సూర్యనారాయణ అన్నారు.మంగళవారం మండలంలోని పోలంపల్లి గ్రామంలో రాజీవ్ మునేర్ ప్రాజెక్టును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగ్గయ్యపేట నందిగామ రెండు నియోజకవర్గాల్లో వత్సవాయి, పెనుగంచిప్రోలు, నందిగామ మండలాలకు చెందిన ఈ ప్రాజెక్టు పూర్తయితే సుమారు 80 వేలు ఎకరాలు ఈ ఆయకట్టు ద్వారా సాగునీరు అందించవచ్చు అన్నారు. వర్షాకాలంలో సీజన్ల వారీగా వర్షాలు క్రమేపి పడుతుండటం తో ఎగువ ప్రాంతాన్నించి వచ్చే వరద రాజీవ్ మునేర్ చెక్ డాం దగ్గర నీళ్లు నిలబడి ఈ వరద నీరు కాలువలు ద్వారా పంట పొలాలకు వెళ్తున్నాయి.అతివృష్టి, అనావృష్టి వల్ల ఎగువ ప్రాంతాల నుంచి గాని సాగర్ జలాల నుంచి కానీ నీళు రాకపోతే ఆయకట్టు భూమి బీడు భూమిగా మారే పరిస్థితి నెలకొంది. 2004 సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి, రాజీవ్ గాంధీ మునేరి డ్యామ్ జలయజ్ఞం పేరుతో శంకుస్థాపన చేశారని అప్పటినుండి ఈ ప్రాజెక్టు పనులు ప్రారంభించారు. బ్రిటిష్ కాలం నాడు ఈ చెక్ డ్యామ్ ద్వారానే 26 వేల ఎకరాలకు సాగు చేస్తున్నారని. దీనిని ఆధునికరించటం ద్వారా ఒక టీఎంసీ నీటిని నిలువ చేస్తే నదిలో ఒక టీఎంసీ నీటిని నిలవ చేయడం కోసం ఆనాడు అంచనా తో పనులు ప్రారంభించారు. ప్రాజెక్టు పూర్తయితే 80,000 ఎకరాల ఆయకట్టు సాగులోకి వస్తుందన్నారు. కొంతకాలం ఈ పనులు సహజంగా సాగాయి. ప్రభుత్వాలు మారటంతో ప్రాజెక్టు పనులు నిర్లక్ష్యం చేయడంతో పనులు ఆగిపోయాయి. వాగ్దానాలు ఇచ్చిన పనులు జరగటం లేదని కూటమి ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పూర్తి




చేయాలని నాయకులు డిమాండ్ చేస్తున్నారు. రైతు సమస్యలను దృష్టిలో పెట్టుకొని ప్రాజెక్టును పూర్తి చేయాలని దీనిపై రైతు సంఘం నాయకులు కోరారు. అంతేకాకుండా పాలకులు నిర్లక్ష్య వైఖరి గురి చేస్తే పెద్ద ఎత్తున ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. నది ప్రక్కనే పొలాలు ఉన్నాయి నదిలో నీళ్లు సముద్రంలోకి వెళ్తున్నాయి.ప్రాజెక్టు కొద్ది మొత్తంతో పూర్తయ్యే పరిస్థితి ఇవి పూర్తి చేయకుండా ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టులు పేరుతో వేల కోట్లు ఖర్చు చేస్తున్నారని. ఈ చిన్న ప్రాజెక్టును ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారో అర్థం కావట్లేదని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాజెక్టును నిలుపుదల చేయటం సరైన పద్ధతి కాదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.వి.ఆంజనేయులు. కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు చిరుమామిళ్ల హనుమంతరావు, రైతు సంఘం మండల అధ్యక్షులు తమ్మినేని రాంబాబు కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి తమ్మినేని రమేష్ సిఐటియు మండల కార్యదర్శి బి.రాము, ఏసుపోగు వెంకటరత్నం, కంచర్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



## ఆక్వా రైతుల ఇబ్బందులు గురించి ఇంచార్జీ కలెక్టర్‌కి వినతి పత్రం అందజేసిన రాజా వాసిరెడ్డి మనోజ్ కుమార్

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మంగళవారం మచిలీపట్టణం కలెక్టర్ కార్యాలయంలో బీజేపీ సీనియర్ నాయకులు రాజా వాసిరెడ్డి మనోజ్ కుమార్ ఆక్వా రైతుల ఇబ్బందులు గురించి వారికీ విద్యుత్ చార్జీలపై ఏభై శాతం సబ్సిడీ ఇవ్వవలసినదిగా కృష్ణజిల్లా ఇంచార్జీ కలెక్టర్ గీతాంజలి శర్మకి వినతి పత్రం అందించారు, ఈ సందర్భంగా అయన జాయింట్ కలెక్టర్ కి ఆక్వా రంగం పూర్తిగా కుదేలై, ఆక్వా రైతులు ఆర్థిక,ఇబ్బందులు ఎదుర్కుంటున్నారని, ఈ పరిస్థితుల్లో వారికి అండగా నిలబడాల్సిన అవసరం అత్యంత కీలకమైంది. ఆక్వా రైతులకు పూర్వ ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించవలసిందిగా కోరుతు ఇప్పటి వరకు ఆక్వా రైతులు పన్నుల రూపంలో గణనీయమైన మొత్తం చెల్లించివున్నారు, కానీ ఇప్పుడు ఆక్వా రంగం పూర్తిగా దెబ్బతినడం వలన, వారు తీవ్ర నష్టాలను ఎదుర్కుంటున్నారని , అందువల్ల వారు చెల్లించిన పన్నులలో కనీసం ఏభై శాతం విద్యుత్ చార్జీలపై సబ్సిడీ ఇవ్వవలసినదిగా,ఆర్థికంగా నిలబడేలా సహాయపడాలని మనవి చేసారు.

## మోటర్ల దొంగను పట్టుకున్న చిలకలపూడి పోలీసులు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మచిలీపట్నంలో నూతనంగా నిర్మిస్తున్న గృహాలకు అమర్చిన మోటర్లను దొంగలిస్తున్న యువకుడును మంగళవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దొంగ వద్దనుండి 10 మోటర్లను రికవరీ చేశారు. చిలకలపూడి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

## 13453 మందికి నులిపురుగుల మాత్రలు పంపిణీ



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా ఇబ్రహీంపట్నం మండలంలో 13,453 మందికి నులిపురుగుల మాత్రలను వేశారు. 33 అంగన్వాడి కేంద్రాలలో, 44 స్కూళ్లలో, మూడు కాలేజీలలో ఈ మాత్రలను విద్యార్థులకు వేయటం జరిగిందని డాక్టర్ విజయకుమార్ తెలిపారు. మంగళవారం జిల్లా పరిషత్ బాలికల పాఠశాల లో716 స్కూల్ విద్యార్థులకు,144 మంది కాలేజీ విద్యార్థులకు స్వయంగా నులిపురుగు మాత్రలను అందించారు. నులిపురుగులు మాత్రవల్ల ఉపయోగాలను విద్యార్థులకు వివరించారు. ప్రతి ఒక్కరూ కచ్చితంగా ఈ నులిపురుగు మాత్రలను తీసుకోవాలని, ఇప్పుడు తీసుకోలేని విద్యార్థులకు కూడా వచ్చేవారం బుధవారం కచ్చితంగా ఈ నులిపురుగుల మాత్రలను వేసుకోవాలని విద్యార్థులకు సూచించారు.

## మూడు సహకార సంఘాలకు పాలకవర్గాల నియామకం





**పెదపారుపూడి ఆగస్టు 12 మేజర్ న్యూస్ :** పెదపారు పూడి మండలంలోని మూడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు చైర్మన్లను నియమించారు. మండల పరిధిలో మొత్తం ఐదు సహకార సంఘాలు ఉండగా వీటిలో మూడింటికి మాత్రమే త్రీమెన్ కమిటీ నియామకం జరిగింది. స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా సూచనల మేరకు ఈ కమిటీల నియామకం జరిగిందని, మిగిలిన సంఘాలకు కూడా త్వరలోనే నియామక ఉత్తర్వులు వెలువడుతాయని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి తెలిపారు. మండలంలోని వెంట్రప్రగడ సంఘం చైర్మన్‌గా కూచిపూడి సుబ్బయ్య, వానపాముల సంఘం చైర్మన్‌గా వేములపల్లి నరసింహారావు, యలమర్రు సహకార సంఘం చైర్మన్‌గా నగుళ్ల శ్రీనివాసరావు లతో పాటు సభ్యులను నియమిస్తూ నియామక ఉత్తర్వులు వెలుపడ్డాయి. మండలంలోని పెదపారుపూడి, పాములపాడు సహకార సంఘాలకు త్వరలో పాలకవర్గాలను ఏర్పాటు చేస్తూ నియామక ఉత్తర్వులు రానున్నాయని రమేష్ చౌదరి తెలిపారు. నూతనంగా సహకార సంఘాలకు చైర్మన్, సభ్యులుగా నియమింపబడిన వారికి ఈ సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలిపారు.



## నులిపురుగు నివారణతో విద్యార్థులకు ఆరోగ్యం

**ఘంటసాల, మేజర్ న్యూస్ :** నులిపురుగు నివారణతో విద్యార్థులకు ఆరోగ్యం కలుగుతుందని ఎంపీపీ వేమూరి రజినీ కుమారి అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఘంటసాల జడ్పీ హై స్కూల్లో విద్యార్థులకు నులిపురుగు నివారణకు ఆల్బెండజోల్ మందులను ఎంపీపీ రజినీ కుమారి మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హైస్కూల్లోని 300 మంది విద్యార్థులకు, పిహెచ్సి పరిధిలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మందులను పంపిణీ చేసినట్లు ఘంటసాల పిహెచ్సి డాక్టర్ వేమూరి ప్రమోద్ కుమార్ తెలిపారు. ఎంపిహెచెస్ పూర్ణచంద్రరావు, ఎంపిహెచ్ శ్రీనివాసరావు, హెచ్ఎం శ్రీరంగవల్లి, ఎంఎల్.హెచ్పి ఎన్.అనూష, ఎఎన్ఎం ఎం.జయలక్ష్మి, ఆశా కార్యకర్త కె.సుశీల, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 185 మంది పిల్లలకు నునుపురుగుల మందులు



**ఘంటసాల, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని తెలుగురావుపాలెంలో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవంలో భాగంగా సెయింట్ జోసెఫ్ కాన్వెంట్ అంగన్వాడిలలో 185 మంది పిల్లలకు నులిపురుగులు మందులు పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ రాచూరి ప్రసాద్ బాబు మాట్లాడుతూ పిల్లల ఎదుగుదలకు నులిపురుగులు అవరోధాలని ఆరోగ్యవంతమైన పిల్లల కోసం ప్రతి ఒక్కరు నులిపురుగులు నిర్మూలన కొరకు మందులు వాడలన్నారు. పిల్లలు పరిశుభ్రంగా ఉండాలని, చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలన్నారు. ఏఎన్ఎం నీలిమ ఎమ్ ఎల్ హెచ్ పి కృష్ణవేణి ఆశా వర్కర్ మీనా రాణి అంగన్వాడి టీచర్లు ఆయాలు, పిల్లలు పాల్గొన్నారు

## వరిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

### సమన్వయకర్త డాక్టర్ సుధారాణి



**ఘంటసాల, మేజర్ న్యూస్ :** వరిలో యాజమాన్య పద్ధతులు పాటించాలని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయ కర్త డా. డి.సుధా రాణి పేర్కొన్నారు. ఆమె మాట్లాడుతూ అలస్యంగా నాట్లు వేసే వరిలో కాండం తొలుచు పురుగు యాజమాన్యంలో భాగంగా నాట్లు వేసుకునే ముందు నారు కొనలను త్రుంచి నాటుకోవాలని, తద్వారా నారు మడి నుండి ప్రధాన పొలంకి పురుగు వ్యాప్తిని అరికట్టవచ్చు అన్నారు. వరిలో ఆకుల అంచుల నుండి పసుపు రంగు నీటి దాగు మచ్చలు ఏర్పడి ఆకుల అంచుల నుండి ఎండి పోతున్నాయని నివారణకు పొటాష్ ఎరువులను మ్యూరేట్ ఆఫ్ పొటాష్ రూపంలో ఎకరానికి 20- 25 కిలోలు చొప్పున రైతులు పిచికారి చేసుకోవాలన్నారు. సస్యరక్షణ శాస్త్రవేత్త రేవతి, సస్యపోషణ శాస్త్రవేత్త వెంకట లక్ష్మీ పాల్గొన్నారు.

## సెంట్రల్ యూనివర్సిటీలో సీటు సాధించిన మైలవరం విద్యార్థిని పసుపులేటి మేఘన



**జి కొండూరు మేజర్ న్యూస్ :** మైలవరం గ్రామానికి చెందిన పసుపులేటి మేఘన అత్యంత ప్రతిభ కనబరిచి సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ (సి టి యూ ) విజయనగరం లో సీటు సాధించింది నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్ టి ఏ) దేశవ్యాప్తంగా నిర్వహించిన సెంట్రల్ యూనివర్సిటీ కామన్ టెస్ట్( సి యు ఈ టి) కు హాజరై ఆన్లైన్ ద్వారా జరిగిన పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించి ప్రతిభ ఆధారంగా సైన్స్ గ్రూపులో బీఎస్సీ బోటనీ స్పెషలైజేషన్ సీటును సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ మెరిట్ లిస్టు ద్వారా సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ( సి టి యూ) లో సీటు సాధించిందని తల్లిదండ్రులు పసుపులేటి చైతన్య రేణుక దేవి తెలిపారు విద్యార్థిని మేఘన ను పలువురు అభినందించారు.

# తీరని యూరియా కష్టాలు, నిస్సహాయ స్థితిలో నియోజకవర్గ రైతులు



**పామర్రు ఆగస్టు 12 మేజర్ న్యూస్ :** మాటల ప్రభుత్వంలో రైతులు ఎదుర్కొంటున్న యూరియా కష్టాలపై మరోమారు పామర్రు మాజీ శాసనసభ్యులు, వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలె అనిల్ కుమార్ తనదైన శైలిలో గళం విప్పారు. మొదట్లో అసలు నియోజకవర్గంలో యూరియా సమస్యలే లేవు, ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైతులకి యూరియా అందుతుంది అని చెప్పిన స్థానిక ఎమ్మెల్యే, కూటమి ప్రభుత్వ పెద్దలు, అధికారులు, వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని రైతులందరూ యూరియా కొరకు ఒక్కసారిగా రోడ్డెక్కేసరికి ఇరకాటంలో పడ్డారని ఎద్దేవా చేశారు. దీనితో డైవర్షన్ రాజకీయాల్లో భాగంగా ప్రజలను మభ్యపెట్టడానికి రైతులకు సీజన్ మొదట్లో ఇవ్వవలసిన పెట్టుబడి సాయాన్ని వాయిదాపద్ధతిలో అన్నదాత సుఖీభవ అంటూ మోసం చేశారన్నారు. అంతే కాకుండా రైతులు పడుతున్న కష్టాన్ని, వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తున్న ప్రతిపక్ష నాయకులపై వ్యక్తిగత విమర్శలు చెయ్యడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నానన్నారు. ఎన్నో ఒడిదుడుకుల మధ్య నాట్లు పూర్తి చేసిన పొలాలకు పంట ఏపుగా పెరగడానికి సరైన సమయంలో విడతలవారీగా యూరియాతో కలిపి కాంప్లెక్స్ ఎరువులు వేయాల్సి ఉందన్నారు. ప్రభుత్వం మేము ఎప్పటికప్పుడు సరిపడినంత యూరియా స్థానిక సహకార సంఘాలలో అందుబాటులో ఉంచుతున్నామని చెబుతున్నప్పటికీ, వాస్తవ పరిస్థితులు మాత్రం దానికి పూర్తి భిన్నంగా దర్శనమిస్తున్నాయ న్నారు. నియోజకవర్గంలోని అనేక గ్రామాల్లో వేకువజామునుంచే రైతులు యూరియా కోసం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల వద్ద బారులు తీరి కనిపిస్తున్నారన్నారు. నిద్రాహారాలు మాని తాము వేసిన పంటకు సరైన సమయంలో ఎరువులు వేయాలని గంటల తరబడి క్యూలో నిలబడి ఎదురు చూస్తున్న రైతులు అక్కడి సొసైటీ సిబ్బంది ఇండెంట్ పెట్టామని, స్టాక్ ఇంకా రాలేదని రేపు వస్తుంది, ఎల్లుండి వస్తుందని చెప్పే సమాధానాలు విని తీవ్ర భావోద్వేగాలతో నిరాశగా వెనుతిరుగుతున్న పరిస్థితులు చాలా బాధాకరమని పేర్కొన్నారు. సొసైటీలకి వస్తున్న యూరియాని ఆయా గ్రామాల్లో వున్న కొందరు వారి అధికార దర్పంతో గుట్టుచప్పుడు కాకుండా క్షణాల్లో మాయం చేసేస్తున్నారని ఆరోపించారు. మేము గతవారంలో అన్ని పిఎసిఎస్ ల వద్ద స్టాక్ ను సూచించేవిధంగా స్టాక్ బోర్డులను ఏర్పాటుచేసేలా, అధిక ధరలకు యూరియా విక్రయిస్తున్న షాపులలో సోదాలు నిర్వహించి బ్లాక్ మార్కెట్ ను నియంత్రిచేలా చూడాలని నియోజకవర్గంలోని ఐదు మండలాల అధికారులకు లిఖితపూర్వక విజ్ఞప్తులు చేశామని, కానీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు లేవని వాపోయారు. సొసైటీల వద్ద రైతులు పడుతున్న కష్టాలను వారి వ్యాపారాలకు అనుకూలతగా మార్చుకునేందుకు బహిరంగ మార్కెట్లోని డీలర్లు, ఫర్టిలైజర్ షాపు నిర్వాహకులు యూరియా కృత్రిమ కొరత సృష్టించి 265 రూపాయలకు అమ్మవలసిన యూరియాను 420 నుంచి 450 రూపాయల వరకు విక్రయిస్తున్నారని తెలిపారు. అంతేకాకుండా యూరియా కావాలంటే వారి వద్ద లభించే గుళికలు, ఇతర ఎరువులు కొంటేనే యూరియా ఇస్తామని నిబంధనలు పెట్టడంతో అంత భారీ వ్యయంతో బయట మార్కెట్ లో యూరియా కొనలేక ప్రభుత్వ సొసైటీలలో యూరియా దొరకక చిన్న, సన్నకారు రైతులు పడుతున్న బాధ వర్ణనాతీతం అన్నారు. గత రెండు రోజులుగా యూరియా స్టాక్ వస్తుందనే వార్తలతో నియోజకవర్గంలోని తోట్లవల్లూరు, జమీగొల్వేపల్లి, వానపాములు, కోసూరు, పెదమద్దాలి, మొవ్వ తదితర కొన్ని సొసైటీల వద్ద రైతులు బారులు తీరుతున్నారని తెలిపారు. అయితే అందుబాటులో వున్న స్టాక్ కంటే అధిక సంఖ్యలో రైతులు రావడంతో, యూరియా దొరకక రైతులు ఎక్కడ తమమీద తిరగబడతారో అనే భయంతో సొసైటీ సిబ్బంది పోలీసుల పర్యవేక్షణలో యూరియా సరఫరా చేస్తున్నారన్నారు. అంతే కాకుండా కొన్నిచోట్ల వ్యవసాయ అధికారులు యూరియా కోసం వస్తున్న రైతులకు పట్టాదారు పాస్ పుస్తకం, శిస్తు రసీదు, ఆధార్ కార్డు ఉంటేనే యూరియా ఇస్తామని అది కూడా ఎకరాకు అరకట్ట లేదా ఒక కట్ట మాత్రమే ఇస్తామని నిబంధనలు పెట్టడంతో రైతులందరూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. అందరికి అన్నం పెట్టే రైతు కన్నీరు పెట్టడం రాష్ట్రానికి ఎంతమాత్రం మంచిది కాదని, అన్నదాత సుఖీభవ అని అబద్ధపు మాటలు చెప్పే ఈ ప్రభుత్వం ఇప్పటికైనా మానవత్వంతో స్పందించి అన్నదాతలు సుఖంగా ఉండడానికి తగిన చర్యలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలోని రైతులు అందరికి తగిన మొత్తంలో యూరియా ప్రభుత్వం నిర్ణయించిన ధరకే అన్ని సొసైటీల వద్ద అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, అంతేకాకుండా రైతుల అవకాశాన్ని ఆసరాగా మార్చుకుని బ్లాక్ మార్కెట్ ద్వారా వారికి నచ్చిన ధరల్లో యూరియా విక్రయిస్తున్న ప్రైవేటు డీలర్లు షాపు నిర్వాహకుల ఆగడాలను నియంత్రించాలని అనిల్ కుమార్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# ప్రతి ఒక్కరూ విధిగా నులిపురుగు నివారణ మాత్రలు తీసుకోండి



**పెదపారుపూడి ఆగస్టు 12 మేజర్ న్యూస్ :** బాల బాలికలంతా విధిగా నులి పురుగుల నిర్మూలన మాత్రలు తీసుకుని శరీరక ఆరోగ్యాన్ని కాపాడు కోవాలని పెదపారుపూడి ఎంపీడీఓ జె.విమాదేవి విజ్ఞప్తి చేశారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవంను పురస్కరించుకొని మంగళవారం పెదపారుపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో జరిగిన కార్యక్రమంలో వైద్య సిబ్బంది తో కలిసి ఆమె పాల్గొని బాల బాలికలకు మాత్రలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలం లోని 1నుండి 19 సంవత్సరాల పిల్లలకు అందరికీ ఒకే రోజున నులిపురుగుల నిర్మూలన మాత్రలు వేయడం జరుగుతుందని, తొలి రోజు అవకాశం లేని వారికి ఈ నెల 20 వ తేదీన మ్యాప్ అప్ రోజున వేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం లో పెదపారుపూడి డిప్యూటీ ఎంపిడివో వంగా శ్రీనివాస్, పెదపారుపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎంపీహెచ్ఈఓ చంద్రశేఖర్, సచివాలయ ఏఎన్ఎం రమాదేవి, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఒప్పో భారతదేశంలో కూలింగ్ ఫ్యాన్‌తో ఉన్న ఏకైక స్మార్ట్‌ఫోన్ విడుదల




**విజయవాడ ఆగస్టు 12, మేజర్ న్యూస్ :** ఒప్పో ఇండియా ఒప్పో కే13 టర్బో సిరీస్ 5జీని ఆవిష్కరించింది. ఇందులో ఒప్పో కే13 టర్బో ప్రో 5జీ, ఒప్పో కే13 టర్బో 5జీ ఉన్నాయి. భారత దేశంలో అంతర్నిర్మిత కూలింగ్ ఫ్యాన్ లి ను కలిగి ఉన్న మొట్టమొదటి స్మార్ట్‌ఫోన్లు, స్మార్ట్‌ఫోన్ థర్మల్ నిర్వహణలో కొత్త బెంచ్‌మార్క్‌ను నెలకొల్పాయి. పనితీరు కోరుకునేవారు మల్టీ- టాస్కర్ల కోసం రూపొందించబడిన ఈ సిరీస్ గేమింగ్, భారీ మల్టీ టాస్కింగ్ విస్తరించిన బహిరంగ వినియోగం కోసం ఉద్దేశించబడింది. అధునాతన యాక్టివ్ పాసివ్ థర్మల్ డిజైన్, శక్తివంతమైన ప్రాసెసర్లు, 80డబ్ల్యు సూపర్‌వూక్తో కూనడి 7000ఎంఏహెచ్ బ్యాటరీతో అమర్చబడింది. ఫాస్ట్ ఛార్జింగ్, 120హెచ్జెడ్ కంటికి అనుకూలమైన ఈ-స్పోర్ట్స్ లెవల్ ఫ్లాట్ స్క్రీన్, కే13 టర్బో సిరీస్ అత్యంత డిమాండ్ ఉన్న సందర్భాలలో కూడా స్థిరమైన, అధిక-పనితీరు అనుభవాలను అందిస్తుంది, ఇది నేటి డైనమిక్ పనితీరుపై ఆధారపడిన యువతకు ఆదర్శవంతమైన ఎంపికగా నిలిచింది. 8జిబి+128 జిబి వేరియంట్ రూ.27,999, 8జిబి+256జిబి వేరియంట్ రూ.29,999 ప్రారంభ ధరకు అందుబాటులో ఉన్న ఒప్పో కె13 టర్బో 5జి మూడు రంగుల ఎంపికలలో అనగా వైట్ నైట్, పర్పుల్ ఫాంటమ్, మిడ్‌నైట్ మావెరిక్ రంగులలో అందుబాటులో ఉంటాయి. 8జిబి+256జిబి వేరియంట్ రూ.37,999, 12జిబి+256జిబి వేరియంట్ రూ.39,999 నుండి ప్రారంభమయ్యే ఒప్పో కె13 టర్బో ప్రో 5జి, సిల్వర్ నైట్, పర్పుల్ ఫాంటమ్, మిడ్‌నైట్ మావెరిక్ రేసింగ్ డిజైన్లలో అందుబాటులో ఉంటుంది. రెండు స్మార్ట్‌ఫోన్‌ల కోసం ప్రీ-బుకింగ్‌లు ఆగస్టు 11, 2025న ప్రారంభమవుతాయి. కె13 టర్బో ప్రో 5జి ఆగస్టు 15, 2025 నుండి, కె13 టర్బో 5జి ఆగస్టు 18, 2025 నుండి ఫ్లిప్‌కార్ట్, ఒప్పో ఇండియా ఈ-స్టోర్, రిటైల్ స్టోర్లలో అమ్మకానికి వస్తాయి. ప్రీ-బుకింగ్ వ్యవధిలో, మొదటి సేల్ రోజున, వినియోగదారులు ఎంపిక చేసిన బ్యాంక్ ఆఫర్‌లు లేదా ఎక్స్ఛేంజ్ బోనస్‌తో రూ.3,000 తక్షణ తగ్గింపును పొందవచ్చు, అంతేకాకుండా అదనంగా 9 నెలల నో కాస్ట్ ఈఎంఐ ఎంపికను పొందవచ్చు. దీని వలన కె13 టర్బో 5జి ధర వరుసగా రూ.24,999, రూ.26,999, కె13 టర్బో ప్రో 5జి ధర వరుసగా రూ.34,999, రూ.36,999కి వస్తుంది. దుకాణదారులు ఫ్లిప్‌కార్ట్ మినిట్స్ ద్వారా ఒప్పో కె13 టర్బో సిరీస్ యొక్క టర్బో స్పీడ్ డెలివరీని వారి ఇంటి వద్దనే పొందవచ్చు.

# మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

## ఆటో కార్మికులకు ఉపాధి సంక్షోభం...



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఆగస్టు 15 నుండి రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించనున్నట్లు ప్రకటించింది. దీంతో ఆటో కార్మికుల జీవనోపాధి దెబ్బతినే అవకాశంపై ఆందోళనలు చేస్తున్నారు కృష్ణా జిల్లా, మచిలీపట్నం కలెక్టరేట్ వద్దనున్న ధర్నా చౌక్లో సిఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ఆటో కార్మికులు ధర్నా నిర్వహించారు. జిల్లాలో సుమారు 50 వేల కుటుంబాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆటో వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. వీరిలో అనేకమంది ఉన్నత చదువులు పూర్తి చేసిన యువత, వ్యవసాయం లాభసాటి కాక ప్రైవేట్ ఫైనాన్సర్లు, బ్యాంకుల వద్ద అప్పులు తీసుకొని ఆటోలు కొనుగోలు చేసి, నెలసరి ఇ.ఎం.ఐలు చెల్లిస్తూ కుటుంబాలను పోషిస్తున్నారు. ఆటో కార్మికులు మహిళల ఉచిత బస్సు పథకానికి వ్యతిరేకం కాదు. బాడుగలు తగ్గి తమ ఆదాయం తీవ్రంగా పడిపోతుందని ఆవేదన, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం, డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన ప్రతి ఆటో కార్మికుడికి 'వాహన మిత్ర' పథకం కింద సంవత్సరానికి రూ.25 వేలు ఆర్థిక సాయం అందించాలని డిమాండ్. పెరిగిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలతో ఇబ్బందులు పడుతున్న ఆటో డ్రైవర్ లు అంతంత మాత్రం ఆదాయంతో కాలం గడుపుతున్న జీవిత నేపథ్యంలో వీటిపై విధించిన వ్యాట్ తగ్గించాలి. అంతేకాకుండా, 2019లో అమల్లోకి వచ్చిన జీవో నెం.21ను రద్దు చేయడం, అన్ని రకాల ఫీజులు, పెనాల్టీలు తగ్గించడం, ఇన్సూరెన్స్ ప్రీమియం తగ్గించడం, వాహన కొనుగోలుకు రూ.4 లక్షల సబ్సిడీతో కూడిన వడ్డీరహిత రుణాలు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మద్రాపు పోలి నాయుడు, యూనియన్ నాయకులు కే దావీదు, ఏ వెంకటేశ్వరరావు, కే పోతురాజు, ఎండి కరీముల్లా, సిహెచ్ జయరావు, కృష్ణ యోహాను అశోక్ దామోదర్ రావు ఎండి భాష గిరిబాబు తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా లైబ్రేరియన్స్ డే దినోత్సవము



**విజయవాడ మేజర్ న్యూస్ :** గవర్నర్ పేట, బందర్ రోడ్, గల ఠా గూర్ స్మారక గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారిణి కె.రమాదేవి అధ్యక్షతన జాతీయ గ్రం థాలయ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్. ఆర్. రంగనాథన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ టీడీ జనార్ధన్ పాల్గొన్నారు. సీనియర్ పాత్రికేయులు పూల విక్రమ్ రంగనాథ్ పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయ దినోత్సవం గురించి , భారతదేశ వ్యాప్తంగా జాతీయ గ్రంథాలయ దినోత్సవం ఆగస్టు 12 న ఎస్ అర్ రంగనాథన్ పుట్టినరోజు సంధర్భంగా ఏటా నిర్వహిస్తారు అని పేర్కొ న్నారు. పబ్లిక్ లైబ్రరీలతో పాటు, అకడమిక్ లైబ్రరీలు, గ్రంథాలయ వికాసా నికి విశేషంగా కృషి చేసిన ఆయన జన్మదినం ను జాతీయ గ్రంథాలయ దినోత్సవంగా నిర్వహిస్తున్నారు అని తెలిపారు. ఈ సందర్భంగా దేశ వ్యాప్తంగా గ్రంథాలయాల్లో సభలు, సమావేశాలు నిర్వహించి ఆయన చేసిన సేవలను స్మరించుకుంటారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పూల విక్రమ్ సీనియర్ పాత్రికేయులు, విజయకుమార్, విద్యార్ధిని, విద్యార్థులు, గ్రంథాలయ అధికారిణి కె.రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

## గుడ్లవల్లేరులో " హర్ ఘర్ తిరంగా " ర్యాలీ

**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్:** "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమం లో భాగంగా, గుడ్లవల్లేరు మండలంలో తిరంగా ర్యాలీ ఘనంగా నిర్వహించారు.. ఈ ర్యాలీ గుడ్లవల్లేరు కార్యదర్శి ఎజెఎల్ నరసింహా రావు నేతృత్వంలో గ్రామంలో వివిధ విద్యాసంస్థల విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, గ్రామస్థులు ఉత్సాహంగా పాల్గొని దేశభక్తి గీతాలు ఆలపిస్తూ, జాతీయ పతాకాన్ని ఊపుతూ దేశ ఐక్యతకు, జాతీయ సమైక్యతకు నిదర్శనంగా నిలిచారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎండి ఇమ్రాన్, ఉప మండల పరిషత్ అభివృద్ధి అధికారి జిఎస్ఎస్ అంజనాదేవి పాల్గొని స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకొని, ప్రతి ఇంటిలో జాతీయ పతాకాన్ని ఎగరేయాలని, దేశాభిమానాన్ని ప్రతీ పౌరుడు గుండెల్లో నింపుకోవాలని పిలుపునిచ్చారు.

## బాధ్యతగా వయోజనులకు విద్య నేర్పండి



**పమిడిముక్కల ఆగస్టు 12 మేజర్ న్యూస్ :** వయోజనకు విద్య నేర్పడంలో ప్రతి ఒక్కరు బాధ్యతగా ఉండాలని ఎండిఓ జి.బి.రామకృష్ణ సూచించారు. వయోజనులకు విద్యను నేర్పామనే సంతృప్తి కలిగేలా ప్రతి ఒక్కరు వ్యవహరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అక్షర ఆంధ్ర ఉల్లాస్ (సమాజం లో అందరికీ జీవితకాల అభ్యాసనం యొక్క అవగాహన) ఫేజ్ 2 కార్యక్రమంలో భాగంగా మండలంలో తొలిదశలో గుర్తించబడిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వాలంటీర్లకు, వెలుగు వాలంటీర్లకు మంగళవారంవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఉల్లాస్ పథకం జిల్లా కోఆర్డినేటర్ వైస్ జ్యోతి పర్యవేక్షణలో జరిగిన ఈ శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వాలంటీర్లు పూర్తి సేవాభావంతో ఉండాలని, వందరోజులలో ఇవ్వబడిన సిలబస్ మేరకు వయోజనులకు విద్యను అందించవలసి ఉందన్నారు. వాలంటీర్లు ఓర్పుగా, నేర్పుగా వ్యవహరించి ఫలితాలు రాబట్టాలని సూచించారు. వెలుగు ఏపీఎం దేవరకొండ వెంకటేశ్వరరావు శిక్షకునిగా వ్యవహరించి వాలంటీర్లకు అవగాహన కల్పించిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎండిఓ దేవరపల్లి వెంకటేశ్వరరావు జాతి ఉపాధి హామీ పథకం ఏపీఓ లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

## జయంతి గ్రామంలో విషాదం.. విద్యుత్ షాక్‌తో లైన్‌మెన్ మృతి

**నందిగామ, ఆగస్టు 12, మేజర్ న్యూస్:** జయంతి గ్రామంలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. విధి నిర్వహణలో ఉన్న ఓ లైన్‌మెన్ విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. మృతుడిని చెరువు మాదారం నాయక్‌గా గుర్తించారు. స్థానికుల కథనం ప్రకారం, నాయక్ కొత్తగా విధుల్లో చేరిన లైన్‌మెన్ జయంతి గ్రామంలోని ఓ విద్యుత్ స్తంభం ఎక్కి వైర్లను సరిచేస్తుండగా, ప్రమాదవశాత్తు విద్యుత్ ప్రసరణ జరిగి షాక్‌కు గురయ్యాడు. దీంతో, అతను స్తంభం పైనుంచి కిందపడిపోయాడు. తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ అధికారులు, పోలీసులు ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# డాక్టర్ శియాలి రామమృత రంగనాథన్‌కి ఘన నివాళి



సిద్ధార్థ అకాడెమి స్వరోత్సవం పురస్కరించుకుని సిద్ధార్థ మహిళా కళాశాల లో గ్రంథాలయ ఎన్‌డిఎల్ఐ క్లబ్ ఆధ్వర్యంలో భారత గ్రంథాలయ శాస్త్ర పితామహుడు డాక్టర్ శియాలి రామమృత రంగనాథన్ జయంతి సందర్భంగా జాతీయ గ్రంథపాలకుల దినోత్సవము ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రంథాలయ శాస్త్రంలోని ఆయన ప్రవేశపెట్టిన ఐదు సూత్రాలు గురించి వివరిస్తూ, వాటిని నేటికీ ప్రపంచంలోని ప్రతి గ్రంథాలయం మార్గదర్శక సూత్రాలుగా అనుసరిస్తున్నాయని డా. వి.వి.ఎస్.ప్రిన్సిపాల్ కుమార్ తన ప్రసంగంలో తెలిపారు. డా. రంగనాథన్ కృషి వల్ల భారతదేశంలో గ్రంథాలయ వ్యవస్థ ఆధునికీకరణ, శాస్త్రీయ వర్గీకరణ పద్ధతులు. వృత్తిపరమైన గ్రంథపాలక సేవలు విస్తరించాయని ఆయన గుర్తుచేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన లొయోల కళాశాల గ్రంథపాలకుడు ప్రసాద్ రావు డా. ఎస్.ఆర్. రంగనాథన్ సేవలను వివరించారు. అలాగే ప్రఖ్యాత గ్రంథపాలకుడు మాన్ అఫ్ ది మిల్లీనియం, పద్మశ్రీ అవార్డుగ్రహీత, కల్యాణసుందరం 35 సంఎగా గ్రంథపాలకుడుగా ఆయన చేసిన సేవలను, అలాగే ఆయన తన జీతం మొత్తం సమాజ సేవకు వినియోగించిన తీరును వివరించారు. దక్షిణ భారతదేశంలో గ్రంథాలయాల విస్తరణ, పఠన సంస్కృతిని పెంపొందించడంలో ఆయన సేవలు మరువలేనివని తెలిపారు ఈ కార్యక్రమానికి విచ్చేసిన మరో విశిష్ట అతిథి ఠాగూర్ స్మారక గ్రంధాలయం గ్రంథపాలకురాలు కొల్లూరు రమాదేవి మాట్లాడుతూ గ్రంథాలయాలు జ్ఞానానికి నిలయాలుగాను, సంస్కృతికి ప్రతీకలు గాను ఉన్నాయి అని తెలిపారు. ఠాగూర్ స్మారక గ్రంథాలయం వనరులు. సేవలు, సదుపాయాలు, అలాగే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి వస్తున్న చదువురులకు అంది స్తున్న సకల సదుపాయాలు గురించి వివరించారు. ఈ సందర్భంగా విశిష్ట అతిథులు ప్రసాద్ రావుని, కొల్లూరి రమాదేవి ని సత్కరించారు. ఈ కార్యక్రమని గ్రంథపాలకులు మల్లిక, లతా పర్యవేక్షించగా, వివిధ కళాశాలల గ్రంథపాలకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎన్నికల సంఘం రాహుల్ ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలి



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఎన్నికల కమిషన్ తప్పులను నిలదీస్తుంటే రాహుల్ గాంధీకి సమాధానం చెప్పకుండా అక్రమ అరెస్ట్ చేయడం బిజెపీ దివలక్కోరు తనానికి నిదర్శనం అని కొడమంచిలి చంద్రశేఖర్ పేర్కొన్నారు. దేశంలో ఎన్నికలు ప్రజాస్వామ్యని పటిష్ట పరచాలి కానీ బిజెపి ఎన్నికల కమిషనర్ తో కలసి అక్రమాలకు పాల్పడుతోంది అంతే కాకుండా ప్రజాస్వామ్యంనీ అవమానించడం దేశానికి పెద్ద ముప్పు అని కాంగ్రెస్ పార్టీ కృష్ణా జిల్లా ప్రధాన కార్యదర్శి కొడమంచిలి చంద్రశేఖర్ క తెలిపినారు. మోడీ దేశ ప్రజలలకు సమాధానం చెప్పాలని డిమాండ్ దేశవ్యాప్త గా ఉందని,దానిని నీరు కాల్చుటకు బీజేపి ప్రయత్నించడం చాలా దుర్మఘపు చర్యలు అని దేశ ప్రజలు అందరు భావిస్తున్నారు అన్ని కె చంద్రశేఖర్ తెలిపారు.

## కృష్ణా యూనివర్సిటీలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** 79వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం అనే నినాదాన్ని అందిపుచ్చుకొని హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా కృష్ణా వర్సిటీ ప్రాంగణంలో 100 అడుగుల జాతీయ పతాకంతో మంగళవారం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉపకులపతి ఆచార్య కె రాంజీ జెండా ఊపి ప్రారంభించిన అనంతరం విద్యార్థులతో పాటు ర్యాలీలో పాల్గొనటం జరిగింది. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రెక్టార్ ఆచార్య ఎం.వి బసవేశ్వర రావు, రిజిస్ట్రార్ ఆచార్య ఎన్ ఉష బోధనా సిబ్బంది తదితరలు పాల్గొన్నారు.

## ఘనంగా లైబ్రేరియన్స్ డే వేడుకలు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మంగళవారం లైబ్రేరియన్స్ డే సందర్భంగా డాక్టర్ ఎస్ ఆర్ రంగనాథన్ 133వ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సంస్థ కార్యదర్శి వి.రవికుమార్ విచ్చేసి స్వర్గీయ ఎస్.ఆర్. రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వారు మాట్లాడుతూ రంగనాథన్ ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన భారతీయ గ్రంథాలయ శాస్త్ర వేత్త, పితామహుడు,అని వీరు ప్రవేశపెట్టిన గ్రంథాలయ పంచ సూత్రాలు, కోలన్ క్లాసిఫికేషన్ క్యాట్ లాగింగ్, కోడ్ లైబ్రరీ సైన్స్ లో చేసిన విలువైన సేవలకు 1957 సంవత్సరంలో భారత ప్రభుత్వం వారికి పద్మశ్రీ పురస్కారాన్ని ప్రధానం చేసిందని తెలిపారు. అనంతరం డిప్యూటీ లైబ్రేరియన్ బీరం వెంకటరమణ మాట్లాడుతూ రంగనాథన్ సేవలకు భారత ప్రభుత్వం నేషనల్ రిసోర్స్ ప్రొఫెసర్ బిరుదుతో సత్కరించి ఈయన పుట్టినరోజుని నేషనల్ లైబ్రేరియన్స్ డే గా జరుపు కుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ విజయ్ కుమార్,ఐవివి రామారావు,కార్యాలయ సిబ్బంది, కేంద్ర గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు విరివిగా పాల్గొని నివాళులర్పించారు

## టిడిపి గ్రామ అధ్యక్షులుగా కొప్పుల సౌరి

**ఏ.కొండూరు, మేజర్ న్యూస్ :** మండలంలోని కంభంపాడు టిడిపి గ్రామ పార్టీ అధ్యక్షులుగా కొప్పుల సౌరి నియమించబడ్డారు. గ్రామ పార్టీ అధ్యక్షులుగా నియమించిన సందర్భంగా విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేసినేని శివనాద్ (చిన్ని), తిరువూరు నియోజకవర్గ శాసనసభ్యులు కొలికిపూడి శ్రీనివాసరావుకు టిడిపి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ పార్టీ అధ్యక్షులు సౌరి మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పనిచేస్తానని పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని ప్రజా సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు.

## కపిలేశ్వరపురంలో హర్ ఘర్ తిరంగా




**పమిడిముక్కల ఆగస్టు 12 మేజర్ న్యూస్ :** పమిడిముక్కల మండల పరిధిలోని కపిలేశ్వరపురం గ్రామంలో మంగళవారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎండిఓ జి.బి. రామకృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు దేశభక్తి పెంపొందించుకునేలా ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరవేయాలని విజ్ఞప్తి చేశారు. మండల పరిధిలోని ప్రతి ఇంటికి జెండాలను పంపిణీ చేస్తున్నామని, ఇంటి యజమానులు తమ ఇళ్లపై ఈ జెండాలను ఎగురవేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని వివిధ శాఖల అధికారులు డ్వాక్రా మహిళలు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం శ్రామికులు పాల్గొన్నారు.

# చేనేతలకు చేయూత....బీసీల అభివృద్ధే కూటమి లక్ష్యం



**సీఎం చిత్రపటానికి పాలాభిషేకం**

**సీఎం చంద్రబాబుకి కృతజ్ఞతలు తెలిపిన వెస్ట్ టిడిపి నాయకులు**

**కార్యక్రమంలో పాల్గొన్న ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ దూండీ రాకేష్**

**విజయవాడ మేజర్ న్యూస్ :** గత ప్రభుత్వం చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ ఇస్తాము... రాయితీ అందిస్తామంటూ మోసపూరిత మాటలతో బీసీలను నట్టేట ముంచింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేనేత కార్మికులకు హ్యాండ్ లూంకు 200 యూనిట్లు, పవర్ లూంకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అమలు చేస్తున్నందుకు రాష్ట్రంలో బిసీలందరూ ఎంతో ఆనందంగా వున్నారని ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ దూండీ రాకేష్ తెలిపారు.పశ్చిమ నియోజకవర్గంలోని ఎంపీ కేశినేని శివనాథ్ క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ఆదేశాల మేరకు నియోజకవర్గ టిడిపి నాయకులు చేనేత కార్మికులకు ప్రభుత్వం అందించిన ఉచిత విద్యుత్ కు కృతజ్ఞతలు తెలుపుతూ చంద్రబాబు నాయుడు చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య చైర్మన్ దూండీ రాకేష్‌తో పాటు నియోజకవర్గ టిడిపి నాయకులు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ దూండీ రాకేష్ మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీల్లోని అన్ని హామీలను ఒక్కొక్కటిగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమలు చేస్తున్నారన్నారు. బడుగు బలహీన వర్గాలకు ఎప్పుడూ సీఎం చంద్రబాబు నాయుడు అండగా వుంటారని తెలిపారు. కార్పొరేషన్ల ద్వారా రుణాలు అందించడం ద్వారా బడుగు బలహీన వర్గాల వారిని పారిశ్రామిక వేత్తలుగా మార్చేందుకు కట్టుబడి ఎన్డీయే కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కుల వృత్తుల్లో వున్న ప్రతి ఒక్కరిని అభివృద్ధి చేసేందుకు ఎన్డీయే కూటమి సహకరిస్తుందని, బీసీల అభివృద్దే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుకు వెళుతున్నారన్నారు. ఎన్డీయే కూటమి అధికారంలో వచ్చి ఏడాది పూర్తైన సందర్భంగా నిర్వహించిన తొలి అడుగు కార్యక్రమంలో ప్రజలకు వున్న సమస్యలు ఉన్నాయో తెలుసుకొని ఆ సమస్యలను పరిష్కరించే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని తెలిపారు.కార్పొరేటర్ ఉమ్మడి చంటి మాట్లాడుతూ ఎంపీ కేశినేని శివనాథ్ ఆదేశాల మేరకు ఎంపీ క్యాంప్ కార్యాలయంలో సీఎం చంద్రబాబు చిత్ర పటానికి పాలాభిషేకం చేసినట్లు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు చేనేతలకు ఉచిత విధ్యుత్ అమలు చేయటం పై హర్షం వ్యక్తం చేశారు.అలాగే ఆగస్టు 15 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు ఉచిత ప్రయాణం చేసేందుకు వీలు స్త్రీ శక్తి పథకం అమలు చేయనున్నారన్నారు. సూపర్ సిక్స్‌లో ఇచ్చిన హామీలతో పాటు పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో అమలు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గ మహిళ అధ్యక్షురాలు సుఖాసి సరిత, ఎన్టీఆర్ జిల్లా వాణిజ్య విభాగ అధ్యక్షుడు సోలంకి రాజు రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు షేక్ ఆశా, డివిజన్ అధ్యక్షులు ఈగల సాంబ, బడుగు వెంకన్న, గంగాధర రెడ్డి, జాహీద్, హజీజ్, పత్తి నాగేశ్వరరావు, చిన్న సుబ్బయ్య, జోగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి గోలి శ్రీనివాసరావు, క్లస్టర్ ఇన్చార్జ్ భవానీ ప్రసాద్, క్లస్టర్ ఇన్చార్జ్ ప్రభుదాసు, నాయకులు మైలవరపు దుర్గారావు, టిడిపి మహిళ నాయకులు విజయలక్ష్మీ, మల్లీశ్వరి, టిడిపి నాయకుడు అన్సార్, ఐటిడిపి నాయకులు చైతన్య, గొల్లపూడి మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పాలా మాధవ లతో పాటు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సీఎం పర్యటన సందర్భంగా భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన సీపీ

**విజయవాడ, మేజర్ న్యూస్ :** మహిళలకు ఉచిత బస్సు పథకంను ఈ నెల 15న ఎన్.టి.ఆర్.జిల్లా పండిట్ నెహ్రూ బస్ స్టాండ్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతులు మీదుగా లాంఛనంగా ప్రారంభిస్తున్న నేపథ్యంలో మంగళవారం ఎన్.టి.ఆర్. జిల్లా నగర పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు, ఇతర శాఖల అధికారులతో కలిసి కృష్ణలంక పోలీసు స్టేషన్ పరిదిలోని పండిట్ నెహ్రూ బస్టాండ్, పరిసర ప్రాంతాలను పరిశీలించి ఏర్పాటు చేయు బందోబస్త్ ఏర్పాట్లపై అధి కారులకు, సిబ్బందికి తగు సూచనలు, సలహాలను అందించారు. అనంతరం భద్రతా పరంగా ఎటువంటి చిన్న లోపాలు లేకుండా కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టాలని ఉన్నత అధికారులకు ఆదేశాలు జారి చేసారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని శాఖల అధికారుల సమన్వ యంతో అప్రమత్తంగా పటిష్టమైన బందోబస్త్ ఏర్పాట్లు, ఇతర ప్రయాణికుల కు వారి ప్రయాణంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన ఇతర మార్గాలను నిర్దేశించే విధంగా, వాహనాల రద్దీ ఏర్పడకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్ల గురించి అధికారులకు పలు సలహాలను అందించారు. ఈ సందర్భంగా నగర పోలీస్ కమీషనర్ మాట్లాడుతూ... ఈనెల 15వ తేదీన పండిట్ నెహ్రూ బస్ స్టాండ్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి చేతులుమీదుగా మహిళల కు ఉచిత బస్సు పథకంను ప్రా




రంభిస్తారు. ఈ నేపథ్యంలో ఈ కార్యక్రమంలో మంత్రులు,వి.ఐ.పి.లు ఇతర అధికారులు పాల్గొంటారు. పి.ఎన్.బి.ఎస్.పరి సర ప్రాంతాలలో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుం డా సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకొని చేయు కట్టు దిట్టమైన భద్రత, పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయడం జరుగుతుందని, పార్కింగ్ ప్రదే శాలు, పరిసర ప్రాంతాలలో ట్రాఫ్ఫిక్ అంతరాయం కలుగకుండా ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నగర పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు, డి.సి.పి. ఎస్.వి.డి.ప్రసాద్, సౌత్ ఎ.సి.పి. పావన్ కుమార్, ఇతర ఏ.సి.పి.లు, ఆర్.టి.సి.అధికారులు, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అల్బెండజోల్‌తో నులి పురుగుల ఆటకట్టు

**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, మేజర్ న్యూస్ :** నులి పురుగులు పిల్లలు, కిశోర బాలల్లో రక్తహీనత, పోషకాల లోపాలకు కారణమవుతాయని.. అందుకే అల్బెండజోల్ మాత్రను తీసుకోవడం ద్వారా ఆదిలోనే వాటిని నిర్మూలించవచ్చని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. విజయవాడ పటమటలంకలోని కొమ్మా సీతారామయ్య జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం జరగ్గా కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో కలిసి చిన్నారులకు స్వయంగా అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నులి పురుగులు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యాన్నీ దెబ్బతీస్తాయని.. ఈ పరిస్థితి చదువుపైనా సమగ్ర వికాసంపైనా ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. అనేక రకాల అనారోగ్యాలకు కారణమవుతున్న నులి పురుగులను కేవలం ఒకే ఆల్బెండజోల్ మాత్రతో నివారించ వచ్చని.. నులిపురుగుల నిర్మూలన ద్వారా పోషకాల లోపం, అలసట, బలహీనత వంటి సమస్యలకు చెక్ పెట్టొచ్చన్నారు. అందువల్ల ఒక సంవత్సరం నిండిన పిల్లల నుంచి 19 సంవత్సరాల వరకు అందరూ తప్పనిసరిగా అల్బెండజోల్ మాత్రలు తీసుకోవాలని సూచించారు. మంగళవారం అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశామని.. ఇంకా ఎవరైనా వివిధ కారణాల వల్ల మాత్ర తీసుకోకుండా ఉండిపోతే వారికి ఈ నెల 20 వ తేదీన స్పెషల్ డ్రైవ్ చేపట్టి మాత్రలు ఇవ్వడం జరుగుతుందన్నారు. నులిపురుగుల సంక్రమణాన్ని తగ్గించేందుకు డీవార్మింగ్‌కు అదనంగా పాటించాల్సిన విషయాలను కూడా వివరించారు. శుభ్రమైన నీటిని తాగడం, చేతులను ఎప్పుడూ శుభ్రంగా ఉంచుకోవడం వంటివాటిని కలెక్టర్ లక్ష్మీశ చిన్నారులకు తెలియజెప్పారు. రాష్ట్ర ఆర్‌కేఎస్‌కే, ఐఈసీ ప్రోగ్రామ్ అధికారి



డా. నిర్మలా గ్లోరి, డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని.. అల్బెండజోల్ మాత్రల ప్రయోజనాలను వివరించారు. ఏడాదికి రెండుసార్లు పిల్లలు, కిశోర బాలలకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పీహెచ్‌సీలు, అంగన్వాడీ కేంద్రాలు, విద్యాసంస్థల్లో గోడపత్రికల ద్వారా నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంపై అవగాహన కల్పించి.. పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, ఐటీఐ, పాలిటెక్నిక్, నర్సింగ్ తదితర విద్యార్థులకు నులి పురుగుల మాత్రలను ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతోందని వివరించారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రామ్ అధికారి డా. మాధవి, పీడియాట్రిషన్ డా. రవితేజ, లబ్బీపేట యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డా. భార్గవి, హైస్కూల్ హెచ్‌ఎం పద్మలత తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా అన్నమ్మ తల్లి 28వ ప్రతిష్ట మహోత్సవం

**అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన గద్దె క్రాంతి**

**కృష్ణలంక మేజర్ న్యూస్ :** 22వ డివిజన్ పరిధిలోని అన్నమ్మ తల్లి 28వ ప్రతిష్ట మహోత్సవం కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి టిడిపి యువ నాయకులు గద్దె క్రాంతి కుమార్ పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అన్నదాన కార్యక్రమం నిమిత్తం రూ. 5 వేలు ఆర్థిక సహాయాన్ని గద్దె క్రాంతి ఆలయ కమిటీ వారికి అందజేశారు. ఈ సందర్భంగా గద్దె క్రాంతికుమార్ మాట్లాడుతూ అన్ని దానాల్లో కల్లా గొప్పది అన్నదానం అన్నారు. ఎదుటివారి ఆకలి తీర్చడంలో ఉండే సంతృప్తి మరి ఏ ఒక్కదాంట్లో ఉండదన్నారు. పండగలు ఉత్సవాల పేరుతో అన్నదానాలు నిర్వహించడం మంచి సాంప్రదాయమని, అన్నదానం నిర్వహించిన కమిటీ సభ్యులను గద్దె క్రాంతి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు విజ్జి సన్యాసిరావు, పెద్ది అన్నారావు, పెద్ది పెద్ద అన్నారావు, తాత సాంబయ్య, బత్తుల నాగేశ్వరావు, తోట శ్రీనివాస్, యాళ్ల దుర్గారావు, నడికోప్పుల శివ, రాంబాబు, కొండేటి వెంకట్రావు, రవి, టెంటు రాజేష్ పాల్గొన్నారు.

## ఫెన్సింగ్లను త్వరగా మరమ్మతులు చేయండి

**విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** ప్రమాదకరమైన, పాడైపోయిన ఫెన్సింగ్లను త్వరగా మరమ్మతులు చేయాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. మంగళవారం ఉదయం తన పర్యటనలో భాగంగా కెనాల్ రోడ్, విద్యధరపురం, కుమ్మరిపాలెం సెంటర్, అంబేద్కర్ రోడ్డు, ఆర్టీసీ వర్క్ షాప్ రోడ్ ప్రాంతాలని పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోగల ప్రమాదకరమైన ఫెన్సింగ్ లను త్వరగా మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యధరపురంలో గల ఔట్ఫాల్ట్ డ్రైన్‌ను పరిశీలించి, నిరంతరం డీసిల్టింగ్ పనులను చేస్తుండాలని అధికారులను ఆదేశించారు. తదుపరి ఆర్టీసీ వర్క్ షాప్ రోడ్‌లో గల అన్న క్యాంటీన్‌ను పరిశీలించి అన్న క్యాంటీన్లో ఎటువంటి మరుమతులు ఉండరాదని త్రాగునీటి వాడుకనీటి సరఫరా లో ఎటువంటి అంతరాయం ఉండరాదని ఆహారంలో నాణ్యత ఉండాలని సమయపాలన కచ్చితంగా చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు, చీఫ్ సిటీ ప్లానర్ కె.సంజయ్ రత్నకుమార్, పర్యవేక్షణ ఇంజనీర్ (వర్క్స్ )పి.సత్యనారాయణ, డిప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విలేకరులు కావలెను

నేటి దినపత్రిక సూర్య నందు

చందర్లపాడు, ఇబ్రహీంపట్నం, మైలవరం, విసన్నపేట, గంపలగూడెం మండలాల్లో పని చేయుటకు విలేకరులు కావలెను.

ఇట్లు ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో

ఫోన్ : 9642 980 999